# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :302 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: గురువారం 13-02-2025 | పేజీలు:4 వెల: 2.00


## ఎన్నికల నామినేషన్ల పరిశీలన పూర్తి.. 33 తిరస్కరణ!

మెదక్-నిజామాబాద్-కరీంనగర్-ఆదిలాబాద్ పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల పరిశీలన పూర్తయింది. పట్టభద్రుల స్థానానికి దాఖలైన 100 నామినేషన్లలో 32 తిరస్కరణ అయ్యాయి. మరోవైపుకు టీచర్స్ ఎమ్మెల్సీ స్థానానికి దాఖలయిన నామినేషన్లలో ఓ నామినేషన్ తిరస్కరణ అయింది. మెదక్-నిజామాబాద్-కరీంనగర్-ఆదిలాబాద్ పట్టభద్రుల, టీచర్స్ నియోజకవర్గాల ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికల ప్రక్రియలో భాగంగా మంగళవారం నామినేషన్ల పరిశీలన ప్రక్రియ ముగిసింది. పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 100 మంది నామినేషన్ వేయగా.. 32 మంది నామినేషన్లు వివిధ కారణాల చేత ఎన్నికల రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. సరైన ఫార్మాట్లో ఉన్న 68 మంది నామినేషన్లు ఆమోదం పొందాయి. ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 17 మంది నామినేషన్లు దాఖలు చేయగా.. ఒకరి నామినేషన్ తిరస్కరణకు గురైంది. 16 మంది నామినేషన్లను ఆమోదించారు. మెదక్-నిజామాబాద్-కరీంనగర్-ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానాలకు ఈ నెల 3 నుండి 10 వరకు నామినేషన్లు స్వీకరించారు.

## స్థానిక సంస్థలకు రేవంత్ కసరత్తు...



హైదరాబాద్,ఫిబ్రవరి12: సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో మొదటి నుంచి ఉన్న సీనియర్లకు గౌరవం ఇస్తూనే తగిన పదవులు కట్టబెట్టేందుకు కసరత్తు చేస్తున్నారు. అందున స్థానిక సంస్థల ఎన్నికలు కూడా సమీపిస్తున్నందున సీనియర్లతో కలిసి ప్రయాణం చేసేందుకు సిద్ధమవుతున్నారు. అందుకే మంత్రివర్గ విస్తరణ.. నామినేటెడ్ పోస్టుల పైన కాంగ్రెస్ అధి నాయకత్వం ఆచి తూచి వ్యవహరిస్తోంది. ఈ నెలాఖరులో తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. పార్టీలో సీనియర్లకు ప్రాధాన్యత పైన రాహుల్ గాంధీ ఇప్పటికే సీఎం రేవంత్‌కు స్పష్టత ఇచ్చినట్లు తెలుస్తోంది. అందులో భాగంగా వీహెచ్ కు కీలక పదవి ప్రకటనకు ముఖ్యమంత్రి సిద్ధం అవుతున్నట్లు సమాచారం. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు పూర్తయింది. పార్టీ సీనియర్లు ఇంకా కొందరికి ప్రాధాన్యత దక్కటం లేదు. ఈ అంశం పైన ఢిల్లీకి లేఖలు వెళ్లాయి. దీంతో, రాహుల్‌గాంధీ పార్టీ సీనియర్లకు తగిన గుర్తింపు ఇవ్వాలని రేవంత్ కు స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. అందులో భాగంగా వారికి పదవుల పైన రేవంత్ కసరత్తు చేస్తున్నారు. పార్టీ సీనియర్ నేత వీహెచ్ కు కీలక పదవి దక్కే అవకాశం కనిపిస్తోంది. వీహెచ్ పార్టీ అధికారంలోకి వచ్చిన రాజ్యసభ సీటు ఆశించారు. అవకాశం వస్తే ఖమ్మం నుంచి పార్లమెంట్ కు పోటీ చేయాలని భావించారు. కానీ, సామాజిక - క్షేత్ర స్థాయి పరిస్థితుల్లో ఆయనకు అవకాశం దక్కలేదు. ఇప్పుడు వీహెచ్ కు కొత్త పదవి పైన కసరత్తు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. శాసనమండలి ఛైర్మన్ పదవి వీహెచ్ కు ఇవ్వటం పైన ప్రతిపాదన తెర మీదకు వచ్చింది. రెండు నెలల్లో ఖాళీ కానున్న ఎమ్మెల్యే కోటా నుంచి వీహెచ్ ను ఎమ్మెల్సీగా ఎంపిక చేయనున్నారు. గతంలోనే వీహెచ్ కు బీసీ కమిషన్ ఛైర్మన్ గా నియమించాలని రేవంత్ భావించారు. అందుకు వీహెచ్ అంగీకరించలేదు. దీంతో, నిరంజన్ కు ఆ పదవి ఖాయమైంది. ఇప్పుడు అసెంబ్లీ స్పీకర్ గా ఎస్సీ వర్గానికి చెందిన ప్రసాద్ కుమార్ ఉన్నారు. మండలి ఛైర్మన్ గా వీహెచ్ కు ఇవ్వాలనేది తాజాగా నిర్ణయం తీసుకున్నారు. ఈ అంశం పైన ఢిల్లీ స్పష్టత ఇచ్చినట్లు తెలుస్తోంది. శాసనమండలి ఛైర్మన్ పదవితో పాటుగా వీహెచ్‌కు కాంగ్రెస్ పార్టీ ఓబీసీ విభాగం జాతీయ ఛైర్మన్ గా నియమించే అంశం పైన చర్చ జరుగుతోంది. తెలంగాణలో కుల గణన తరువాత కాంగ్రెస్ పార్టీ నేతలు బీసీలకు ప్రాధాన్యత ఇచ్చేలా నిర్ణయాల పైన కసరత్తు చేస్తున్నారు. అందులో భాగంగా పార్టీకి తొలి నుంచి అంకిత భావంతో పని చేస్తున్న బీసీ నేతలకు పదవులు ఇవ్వాలని తాజాగా ఢిల్లీ లో జరిగిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. వీహెచ్ తో పాటుగా పార్టీలో పలు కీలక పదవుల ను బీసీ నేతలకు ఖరారు చేసే అవకాశం కనిపిస్తోంది. పీసీసీ చీఫ్ పదవి సైతం బీసీ వర్గానికి కేటాయించిన అధినాయకత్వం.. త్వరలోనే కీలక నిర్ణయాలు ప్రకటించేందుకు సిద్దం అవుతోంది.

## ఈసీ అఖిలపక్షంలో ట్విస్ట్.. నోటాను వ్యతిరేకించిన కాంగ్రెస్

హైదరాబాద్, స్థానిక సంస్థల ఎన్నికల కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం ఇవాళ నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. పంచాయితీ ఎన్నికల్లో నోటాను ప్రవేశపెట్టాలన్న ప్రతిపాదనను అధికార కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించింది. దీంతో ఎలాంటి నిర్ణయం తీసుకోకుండానే భేటీ ముగిసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా.. పంచాయితీ ఎన్నికల్లో నోటాను ప్రవేశపెట్టాలని ఈసీ ప్రతిపాదన చేసింది. దీనికి కాంగ్రెస్ తప్ప.. అన్ని రాజకీయ పార్టీల దాదాపుగా సానుకూలంగానే స్పందించాయి. నోటాతో ఎన్నిక ఖర్చు ఎక్కువ అని, ఒకవేళ నోటాతో ఎన్నిక నిర్వహించినా సెకండ్ లార్జెస్ట్ పార్టీనే విజేతగా ప్రకటించాలని కాంగ్రెస్ ఈసీని కోరింది. నోటాపై అభిప్రాయం సేకరణలో బీఆర్ఎస్ సానుకూలంగా స్పందించింది. ఏకగ్రీవానికి.. బెదిరింపులు, బలప్రదర్శన చేసే అవకాశం ఉందని ఈసీకి తెలిపింది. అలాగే.. కొత్త మండలాల వివరాలను రాజకీయ పార్టీలకు ఇవ్వాలని ఈసీని కోరింది. ఇక.. సుప్రీం కోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నందున అభిప్రాయం ఇప్పుడే చెప్పలేమని పేర్కొంది. అలాగే.. రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఈ విషయంపై నిర్ణయం తీసుకునే అధికారం లేదని గుర్తు చేసింది. పంచాయతీ ఎన్నికల నిర్ణయం ప్రభుత్వమే తీసుకోవాలని స్పష్టం చేసింది. నోటాతో ఎన్నిక ఉండాలని సుప్రీంకోర్టు ఇప్పటికే చెప్పిందని




సీపీఎం గుర్తు చేసింది. అభ్యర్థి కంటే నోటాకు ఎక్కువ ఓట్లు వస్తే రీ-ఎలక్షన్ కరెక్ట్ కాదు. ఎన్నిక కండక్ట్ చేయడం అవసరం.. నోటాకు ఎక్కువ ఓట్లు అనేది తర్వాత చర్చ అని వామపక్ష పార్టీ అభిప్రాయపడింది. ఇక.. తెలంగాణ టీడీపీ తమ అభిప్రాయాన్ని రెండు మూడు రోజుల్లో చెప్తామనగా, సింగిల్ అభ్యర్థిగా అయినా నోటా ఉండాలని జనసేన పార్టీ ఈసీకి విజ్ఞప్తి చేసింది.

## జీహెచ్ఎంసీ కార్మికుల సేవలను ప్రభుత్వం గుర్తించింది

హైదరాబాద్,ఫిబ్రవరి12:జీహెచ్ఎంసీ కార్మికులు చేస్తున్న సేవలను కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తిస్తుందని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. తెలంగాణ జనసమితి మద్దతు ఇచ్చిన ఐఎన్‌టీయూసీ అనుబంధ మునిసిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో సరూర్‌నగర్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో జరిగిన జీహెచ్ఎంసీ ఉద్యోగులు, కార్మికుల సమావేశంలో ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు, రాజ్యసభ మాజీ సభ్యులు డాక్టర్ సంజీవరెడ్డి, కనీస వేతనాల బోర్డు ఛైర్మన్ జనక్‌ప్రసాద్, సత్యజిత్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు అదిల్ షరీఫ్, ప్రధాన కార్యదర్శి ఏవీఎస్ గాంధీ, అదనపు ప్రధాన కార్యదర్శి శివకుమార్, టీజేఏసీ కన్వీనర్ ఆకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ ఐఎన్‌టీయూసీ, జీహెచ్ఎంసీ కార్మిక యూనియన్ నాయకులతో కలిసి కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో చర్చిస్తానన్నారు. ఈ సందర్భంగా హయత్‌నగర్, ఎల్‌బీనగర్, సరూర్‌నగర్ సర్కిళ్లకు చెందిన పలువురు ఉద్యోగులు, కార్మికులు సంజీవరెడ్డి సమక్షంలో ఐఎన్‌టీయూసీలో చేరారు. ఈ




కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జోనల్ ప్రెసిడెంట్ శివకుమార్, కార్యదర్శి శరణ్‌జిత్‌సింగ్, నాయకులు శివరాజ్, మహేష్, నరసింహ, యాదగిరి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తమది ఒంటరి పోరాటమే



కోల్‌కతా,నవంబర్12: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ ఒంటరి పోరాటంచేస్తుందని ఆ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ స్పష్టం చేశారు. పశ్చిమ బెంగాల్‌లో 2026 ఏప్రిల్-మే నెలల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో అధికార తృణమూల్ కాంగ్రెస్ ఒంటరిగానే పోటీ చేస్తుందని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పార్టీ శాసనసభాపక్ష సమావేశంలో ప్రకటించారు. పార్టీ అధికార పత్రిక జాగో బంగ్లా ఈ విషయం వెల్లడించింది. తమకు ఎవరి మద్దతు అవసరం లేదని కూడా స్పష్టంచేసింది. ఇండియా బ్లాక్‌లోని కాంగ్రెస్, తదితర పార్టీలతో పొత్తు లేకుండా టీఎంసీ ఒక్కటే మూడింట రెండు వంతుల మెజారిటీతో గెలిచి బెంగాల్‌లో వరుసగా నాలుగోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని మమత ధీమా ప్రకటించారు. దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీలు వేర్వేరుగా పోటీచేయడం వల్ల ఓట్లు చీలి భాజపా గెలవడంతో అందరికీ భయం పట్టుకున్నందునే తృణమూల్ ఇలాంటి అనవసర వ్యాఖ్యలు చేస్తోందని పశ్చిమ బెంగాల్ కాంగ్రెస్ పార్టీ వ్యాఖ్యానించింది. మరోవైపు దిల్లీలో ఉచితాలు పంచినా ఆప్ ఓడిపోయినట్లే బెంగాల్‌లో కూడా టీఎంసీ పరాజయం పాలవుతుందని రాష్ట్ర భాజపా నాయకులు హెచ్చరిస్తున్నారు. కాంగ్రెస్ వెన్నుపోటు వల్లే దిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఓడిపోయిందని, ప్రతిపక్ష ఇండియా కూటమిలో కొనసాగే హక్కు కాంగ్రెస్‌కు లేదని టీఎంసీ లోక్ సభ సభ్యుడు కీర్తి ఆజాద్ దిల్లీలో విమర్శించారు. కాంగ్రెస్ మునిగిపోతున్న పడవ అయినా అది మిత్రపక్షాలను వెన్నుపోటు పొడుస్తూనే ఉందని వ్యాఖ్యానించారు. భాజపా ఇతర పార్టీలతో కలసి రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిందనే వాస్తవాన్ని కాంగ్రెస్ గ్రహించడం లేదన్నారు. కాంగ్రెస్‌కు దురహంకారం ఎక్కువని, ఇండియా కూటమికి మమతా బెనర్జీయే నాయకత్వం వహించాలని ఆజాద్ పేర్కొన్నారు. మరోవైపు ఇండియా కూటమి లోక్‌సభ ఎన్నికల్లో భాజపాను ఓడించడానికి ఏర్పడిందని, రాష్ట్రాల్లో కూటమి కట్టే విషయమై విడిగా చర్చిస్తామని కాంగ్రెస్ నాయకుడు ఉజ్వల్ రమణ్ సింగ్ వివరించారు. దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తుకు ఆప్ నిరాకరించడం వల్లనే విడిగా పోటీచేశామని కాంగ్రెస్ తెలిపింది.

## కలసి వస్తే కాంగ్రెస్ తో లేకుంటే ఒంటరిగానే



హైదరాబాద్,తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడం ఖాయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. తమకు మిత్రపక్షమైన కాంగ్రెస్ తమతో కలిసి వస్తే ఉమ్మడిగా పోటీ చేస్తామని, లేకుంటే బలంగా ఉన్న చోట అభ్యర్థులను బరిలోకి దింపుతామని చెప్పారు. హైదరాబాద్ లో ఆయన ఇవాళ మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కమ్యూనిస్టులను కలుపుకోవడంలో వైఫల్యం చెందిందన్నారు. సమన్వయం చేసుకోవడంలో విఫలమైందని పేర్కొన్నారు. కమ్యూనిస్టు పార్టీల కలయికతోనే గెలిచిందని కాంగ్రెస్ పార్టీ మర్చిపోతున్నదని అసహనం వ్యక్తం చేశారు.. స్థానిక సంస్థల ఎన్నికలలో రేవంత్ పాలనపై ప్రజలే తీర్పు ఇస్తారని అన్నారు..

### ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతు కాంగ్రెస్ కే

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి మద్దతు ఇస్తున్నామని, ఉపాధ్యాయ ఎమ్మెల్సీల అభ్యర్థుల్లో ఎవరికి మద్దతు ఇవ్వాలనే దానిపై చర్చిస్తున్నామన్నారు. ఎస్సీ వర్గీకరణ, బీసీ కులగణన చేయడాన్ని తాను స్వాగతిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొండి పోకడకు వెళ్లకుండా ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

### ఎన్ కౌంటర్ పేరుతో హత్యలు

మావోయిస్టులను ఎన్ కౌంటర్ పేరుతో చంపేస్తున్నారని, దీనిపై న్యాయ విచారణ జరిపించాలని ఎమ్మెల్యే కూనంనేని కోరారు. కాగా, మావోయిస్టులను అంతం చేసేందుకు మార్చి నెలలో ముహూర్తం పెట్టారు. ముహూర్తాలు ఎవరు పెడతారు.. ఎందుకు పెడతారు ? రాజ్యాంగాన్ని కాలరాసే విధంగా మావోయిస్టులను మట్టుపెట్టడానికి ముహూర్తాలు పెట్టడం ఏమిటి ? మావోయిస్టులు సంఘ విద్రోహ కార్యక్రమాలు చేస్తున్నారు. సంఘవిద్రోహులేమో అసెంబ్లీలో, పార్లమెంట్లో ఉంటారు. ప్రజలకోసం పనిచేసే మావోయిస్టులను చంపేస్తారా?. అమిత్ షా హత్యలు చేస్తున్నట్టే.. అతనిపై విచారణ చెయ్యాలి' అని కూనంనేని పేర్కొన్నారు.

## సనాతనధర్మ పరిరక్షణ యాత్రలో పవన్ కళ్యాణ్

కొచ్చి,నవంబర్12: తిరుమల లడ్డూ వివాదంపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు.. తిరుమల లడ్డూ వివాదం దురదృష్టకరం అని అన్నారు. ప్రస్తుతం సనాతన ధర్మ యాత్రలో ఉన్న పవన్ కళ్యాణ్ మీడియాతో మాట్లాడుతూ ఈమేరకు కీలక వ్యాఖ్యలు చేశారు. ఆలయాల నుంచి ఎవరూ డబ్బులు ఆశించకూడదని.. కానీ అలా జరగకపోవడం బాధాకరమని అన్నారు. ఘటనకు బాధ్యులైన నిందితులు అరెస్టయ్యారని అన్నారు. తిరుమల కల్తీ నెయ్యి కేసులో ఇటీవల సీబీఐ నలుగురిని అరెస్ట్ చేసిన క్రమంలో పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. సనాతన ధర్మ యాత్రలో భాగంగా బుధవారం కేరళ, తమిళనాడులోని వివిధ పవిత్ర స్థలాలకు పవన్ కళ్యాణ్ తీర్థయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా తమిళనాడులోని పవిత్ర స్థలాలకు ఆధ్యాత్మిక యాత్రకు బయలుదేరారు. కొచ్చి అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న ఆయన తన ప్రయాణంలో శ్రీ అగస్త్య మహర్షి ఆలయాన్ని దర్శించుకొని.. ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత పవన్ కళ్యాణ్ కేరళ పర్యటనకు వెళ్లారు. సనాతనధర్మ పరిరక్షణలో భాగంగా కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లోని పలు ఆలయాలను పవన్ సందర్శించనున్నారు. దీనిలో భాగంగా బుధవారం ఆయన కేరళలోని కొచ్చి సమీపంలో ఉన్న అగస్త్య మహర్షి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. పవన్ కళ్యాణ్ వెంట ఆయన కుమారుడు అకీరానందన్, తితిదే బోర్డు సభ్యుడు ఆనంద్‌సాయి ఉన్నారు. బుధవారం సాయంత్రం తిరువనంతపురంలోని పరశురామ స్వామి ఆలయాన్ని పవన్ సందర్శించనున్నారు. మూడు రోజుల పర్యటనలో అనంత పద్మనాభస్వామి, మధుర మీనాక్షి, అగస్త్య జీవసమాధి, కుంభేశ్వర, స్వామిమలైయ్, తిరుత్తణి



సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాలకు పవన్ వెళ్లనున్నారు. మూడు రోజుల పాటు కేరళ, తమిళనాడులోని పలు పుణ్య క్షేత్రాలను పవన్ కళ్యాణ్ దర్శించుకోనున్నారు. పవన్ కళ్యాణ్ నడుము నొప్పి బాధపడుతుండడంతో రాష్ట్రం సచివాలయంలో మంత్రులు, ముఖ్య కార్యదర్శులతో సిఎం చంద్రబాబు నాయుడు నిర్వహించిన సమావేశానికి ఆయన రాలేదు. మంత్రి నాదెండ్ల మనోహర్ కలుగ జేసుకొని పవన్ రెండు వారాలుగా తీవ్రమైన నడుము నొప్పితో బాధపడుతున్నారని, అందుకే సమావేశానికి రాలేదని చెప్పారు. రెండు మూడు రోజుల్లో విధులకు హాజరవుతారని వివరణ ఇచ్చారు. వెంటనే చంద్రబాబు స్పందించారు. పవన్‌తో మాట్లాడేందుకు ప్రయత్నించానని, కానీ దొరకలేదని, ఇప్పుడెలా ఉన్నారని బాబు అడిగారు. కాస్త పర్వాలేదని మనోహర్ జవాబిచ్చారు.

## 12వ తేది వచ్చింది.. జీతాలెక్కడా? : రేవంత్ సర్కార్ ను నిలదీసిన హరీశ్ రావు

హైదరాబాద్,సకాలంలో హోం గార్డులకు ప్రభుత్వం జీతాలు చెల్లించడంలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. ప్రభుత్వ తీరు వల్ల రాష్ట్రంలోని 16 వేలకు పైగా హోంగార్డులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారని అన్నారు. పిల్లల ఫీజులు, ఇంటి అద్దెలు, రోజువారీ ఖర్చుల కోసం అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొందని చెప్పారు. పథకాల్లో కోతలు, జీతాలు చెల్లించకుండా వాతలు అంటూ ట్వీట్ చేశారు. 12 వ తేది వచ్చినా హోంగార్డులకు ఇంత వరకు జీతాలు చెల్లించకపోవడం సిగ్గుచేటని హరీశ్ విమర్శించారు. చేతిలో చిల్లిగవ్వలేక హోంగార్డులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈఎంఐలు చెల్లించకపోవడంతో బ్యాంకు వాళ్లు ఫోన్లు చేసి నిలదీసే పరిస్థితి వచ్చిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇదే పరిస్థితి కొనసాగుతోందని చెప్పారు. దీనికి ముఖ్యమంత్రి ఏం సమాధానం చెపుతారని



ప్రశ్నించారు. ఇది ప్రజా పాలన కాదని, ప్రజా వ్యతిరేక పాలన అని అన్నారు. హోంగార్డులకు వెంటనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

## ఎన్నికల్లో ఉచిత హామీలపై సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు



న్యూఢిల్లీ,దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా ఓటర్లపై పార్టీలు ఉచిత వరాల జల్లులు కురిపిస్తున్నాయి. తాజాగా ఇదే అంశంపై దేశ సర్వోన్నత న్యాయస్థానం సంచలన వ్యాఖ్యలు చేసింది. ఎన్నికల్లో ఉచిత హామీలు ప్రకటించడాన్ని ధర్మాసనం తీవ్రంగా తప్పుబట్టింది. పట్టణ ప్రాంతాల్లో నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించాలంటూ దాఖలైన పిటిషన్‌పై బుధవారం సుప్రీం కోర్టు విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జ్‌లతో కూడిన ధర్మాసనం సీరియస్ వ్యాఖ్యలు చేసింది. ఉచిత రేషన్, ఉచితంగా నగదు అందజేయడం వల్ల ప్రజలు పనిచేయడానికి ఇష్టపడడం లేదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఉచితాలు కారణంగా ఏ పనీ చేయకుండానే ఆహారం, డబ్బు సంపాదిస్తున్నారని తెలిపింది. ఈ పథకాల ద్వారా లబ్దిదారులను సమాజంలో ప్రధాన స్రవంతిలో కలపకుండా పరాన్నజీవులుగా మారుస్తున్నారని జస్టిస్ బీఆర్. గవాయ్ వ్యాఖ్యానించారు. ఉచిత పథకాలు కారణంగా ప్రజలు పని చేయడం లేదని.. ఈ పరిణామం దేశాభివృద్ధి కుంటుపడేలా చేస్తుందని అభిప్రాయపడింది. ప్రజల పట్ల ఉన్న శ్రద్ధను అభినందిస్తున్నాం.


# సంపాదకీయం

గురువారం 13-02-2025

## అవినీతి రాజకీయాలను ప్రజలే పాతరేయాలి !

వివిధ కేసుల్లో ఉన్న ప్రజాప్రతినిధులను తక్షణం రాజకీయాలకు దూరంగా చేయాల్సిన అవసరాన్ని తాజాగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుతో ప్రజాస్వామ్య వాదులను, లేదా భారత ప్రజలను హెచ్చరించింది. చట్టాలు చేసే ప్రజాప్రతినిధు లు నేరస్తులు అయివుంటే ఆ చట్టాలు ఎలా ఉంటాయో ఊహించుకోవాలి. చట్టాలను తుంగలో తొక్కుతున్న వైనం చూస్తున్నాం. కోర్టు తీర్పులను కాలరాస్తున్న నేతలను చూస్తున్నాం. ఇలాంటి సమయంలో సుప్రీం ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు ప్రజలకు కనువిప్పు కావాలి. అవినీతి, క్రిమినల్ రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజలంతా చైతన్యం కావాలి. మాకొద్దీ దగుల్బాజీ రాజకీయమని నినదించాల్సి ఉంది. మరో అన్నా హాజారే లాగా ఉద్యమించాల్సి ఉంది. ప్రజలు తమ దేశం కోసం లేదా అవినీతి లేని రాజకీయం కోసం కొంతం సమయం వెచ్చించాల్సి ఉంది. చిన్న లంచం తీసుకుంటేనే అరెస్ట్ చేసి బొక్కలో వేస్తున్న మనం..ఇప్పుడు క్రిమినల్ కేసులు, డబ్బులు స్వాహా చేసిన వారిని, ప్రజాధనం లూటీ చేసిన వారిని రాజకీయాల్లో కొనసాగించడం అవసరమా అన్నది చర్చించాలి. ప్రజాప్రతినిధుల కేసుల వేగవంతంపై సుప్రీం కోర్టులో సోమవారం విచారణ జరిగింది. క్రిమినల్ కేసుల్లో దోషులుగా తేలిన నేతలు తిరిగి ఎన్నికల్లో పోటీ చేయకుండా జీవితకాల నిషేధం విధించాలని కోరుతూ అశ్వినీ ఉపాధ్యాయ్ 2016లో దాఖలు చేసిన పిల్‌పై జస్టిస్ దీపాంకర్ దత్తా జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం విచారణ జరిపింది. అమికస్ క్యూరీ విజయ్ హన్సారియా సమర్పించిన నివేదికను ధర్మాసనం పరిశీలించింది. 42 మంది లోక్‌సభ ఎంపీలపై క్రిమినల్ కేసులు ఉన్నాయని, కొన్ని చోట్ల ప్రజాప్రతినిధులపై 30 ఏళ్లుగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని అమికస్ క్యూరీ తన నివేదికలో పేర్కొన్నారు. దేశంలో చాలా చోట్ల కేసుల విచారణకు ప్రత్యేక కోర్టులు లేవన్నారు. నిజానికి చట్టాలు చేసే పార్లమెంట్, అసెంబ్లీలో క్రిమనల్స్ లేదా కేసులు ఉన్నవారు మంచి చట్టాలు చేస్తారని అనుకోవడానికి లేదు. బెయిల్‌పై ఉన్న జగన్ ఐదేళ్లు సిఎంగా పాలన చేశారు. ఇష్టం వచ్చినట్లుగా అప్పులు చేశారు. తొమ్మిదిన్నరేళ్లు సిఎంగా ఉన్న కెసిఆర్ అనేక ఆర్థిక అవతవకలకు పాల్పడ్డారు. ఇలాంటి పరిస్థితులు వస్తున్నాయనే అన్నాహజారే జనలోక్‌పాల్ బిల్లు తేవాలని డిమాండ్ చేశారు. కానీ కోర్టు కేసుల్లో ఉన్న నేతలు మళ్లీ మళ్లీ ఎన్నికవుతూ...ఈ సదాశయాన్ని తుగంలో తొక్కారు. తమ విలాసాలకు డబ్బులు విచ్చలవిడిగా ఖర్చు చేశారు. అందుకు కేజ్రీవాల్ నివాసం, విశాఖలో జగన్ కట్టించిన విలాసవంతమైన భవనాలే నిదర్శనం. ప్రజలు తిండికి, గుడ్డకు కష్టపడుతుంటే ..ప్రజాధనంతో జల్సాలు చేసే నేతలు దేశానికి అవసరమా అన్నది ప్రజలే ఆలోచించాలి. ఇకపోతే కేసులు ఎదుర్కొంటున్న నిందితులు ఏళ్లుగా విచారణకు రాకపోవడం, పదేపదే వాయిదాలు కోరుతుండటం జాప్యానికి మరో కారణమని నివేదికలో పొందుపరిచారు. దీనిపై సుప్రీం కోర్టు ధర్మాసనం స్పందిస్తూ క్రిమినల్ కేసులుంటే ఉద్యోగంలో చేరేందుకే అనర్హులని, అలాంటిది ప్రజా ప్రతినిధులుగా ఎలా అర్హులవుతారని తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఈ విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం మరింత పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని, దానికి అనుగుణంగా ఉన్నత పరిష్కారం ఆలోచించాలని కూడా సూచించింది. సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ కొన్ని ర ష్ట్రాల్లో ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయకపోవడంపై ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. నిజానికి సుప్రీం వెలిబుచ్చిన అభిప్రాయాన్నే ఆనాడు అన్నాహజారే వెలిబుచ్చారు. రాజకీయ అవినీతిని తరిమేందుకు ప్రత్యేక కోర్టులు లేదా జనలోక్÷–పాల్ రావాలని డిమాండ్ చేశారు. నేను అవినీతికి వ్యతిరేకమని అంటున్న మోడీ కూడా దీనిగురించి పెద్దగా పట్టించుకోవడం లేదు. ఇకపోతే రాజకీయ నేతలు తెలివిలో ఆరితేరారు. లాలూప్రసాద్పై కేసు రాగానే ఆయన భార్యను రంగంలోకి దింపారు. తరవాత కుమారుడు రంగంలోకి దిగాడు. శిక్షపడిన వారిని పార్టీ పదవుల్లో ఉండరాదని చెబితే వారు తమ భార్యల ద్వారానో, మరెవరి ద్వారానో రిమోట్ కంట్రోల్‌తో పార్టీని నడిపిస్తున్నారు. అందువల్ల అన్ని రకాల పరిస్థితులను ఊహించి, కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, మేం తీసుకునే నిర్ణయం లోపభూయిష్ఠంగా ఉండరాదు. అలా ఉంటే తీర్పు ఎలాంటి ప్రభావం చూపకపోగా, వ్యవస్థపై ప్రజలు మరింతగా విశ్వాసం కోల్పోతారని కూడా సుప్రీంకోర్టు అభిప్రాయ పడింది. అందుకే రాజకీయాలు నేరమయం కావడం తీవ్ర అంశమని ధర్మాసనం వ్యాఖ్యానించింది. క్రిమినల్ కేసుల్లో దోషిగా తేలినవారు పార్లమెంటుకు ఎలా వస్తారని విస్మయం వ్యక్తం చేసింది. 42 శాతం మంది సిటింగ్ సభ్యులపై పెండింగ్ కేసులుండడం సిగ్గుచేటని తెలిపింది. శిక్షపడ్డ ప్రజాప్రతినిధులపై కేవలంఆరేళ్ల పాటే అనర్హత వేటు వేసి వదిలేస్తే ఎలా అని కూడా సంశయించింది. వారిపై శాశ్వత వేటు వేయాలి.. చట్టాలు చేసేవారు పవిత్రంగా ఉండాలని వ్యాఖ్యానించింది. దోషిగా తేలిన వ్యక్తి రాజకీయ పార్టీ అధ్యక్షుడిగా ఉండడం సరైనదేనా అని కూడా ప్రశ్నించింది. సుప్రీం అభిప్రాయం ప్రకారం నేరాలకు పాల్పడి శిక్ష పడ్డ రాజకీయ నేతలు చట్టసభల్లో పోటీ చేయకుండా శాశ్వతంగా నిషేధం విధించడం అవసరం. అప్పుడే మన ప్రజాస్వామ్యంలో కళంకితును దూరం చేయగలం. ఈ విషయంలో మూడు వారాల్లోగా అభిప్రాయాన్ని తెలపాలంటూ సుప్రీంకోర్టు కేంద్రాన్ని, ఎన్నికల కమిషన్‌ను ఆదేశించిన నేపథ్యంలో వారి అభిప్రాయం ఎలా ఉన్నా ప్రజలు ముఖ్యంగా ఓటేస్తున్న ఓటర్లు చర్చించాలి. క్రిమినల్ కేసుల్లో ఉన్నవారిని నెత్తికి ఎత్తుకోవాల్సిన అవసరం ఉందా అన్నది విచారణ చేయాలి. రాజకీయాలు నేరమయం కావడం తీవ్రమైన అంశంగానే చూడాలి. చట్టసభల ప్రతినిధులపై కేసుల విచారణ వేగవంతం చేయాల్సిందే. నేరచరిత్ర ఉన్న ఎంపీలు, ఎమ్మెల్యేలను శాశ్వతంగా చట్టసభల్లో ప్రవేశించకుండా వేటువేయాలనే సుప్రీం అభిప్రాయానికి అనుగుణంగా ఓటర్లు స్పందించాలి. జనం స్పందించాలి. నేరమయ రాజకీయాలకు పాతరేయాలి. ప్రతిపాదనపై కేంద్రం, ఎన్నికల కమిషన్ స్పందిం చాలని కోరినా అల ఆజరుగుందని అనుకోవడానికి లేదు. వారు సానుకూలంగా స్పందిస్తారని ఆశించడం కూడా అత్యాశే అవుతుంది. అదేదో ప్రజలే చేయాలి. నేరమయ రాజకీయ నేతలను దూరంగా పెట్టే చైతన్యంతో సాగాలి.

## మణిపూర్ శాంతిస్తుందా?




మణిపూర్:ఎట్టకేలకు మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్. బీరేన్ సింగ్ తన పదవికి రాజీనామా చేశారు. దాదాపు రెండేళ్లనాడు హత్యలూ, అత్యాచారాలూ, గృహదహనాలతో అట్టుడికి ప్రపంచవ్యాప్తంగా మన దేశ పరువు ప్రతిష్ఠలను మంటగలిపిన ఆ రాష్ట్రం 649 రోజులైనా ఇప్పటికీ పూర్తిగా కోలుకోలేదు. 2023 మే 3న రాష్ట్రంలో ప్రధాన తెగలైన మెయితీలకూ, కుకీలకూ మధ్య రాజుకున్న ఘర్షణలు చూస్తుండ గానే కార్చిచ్చులా వ్యాపించగా అధికారిక లెక్కల ప్రకారమే 260 మంది ప్రాణాలు కోల్పోయారు. 60,000 మంది ఇప్పటికీ తమ స్వస్థలాలకు వెళ్లలేక సహాయ శిబిరాల్లో బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. భద్రతా బలగాల పహారా కొనసాగుతున్నా మెయితీలు, కుకీలు ఒకరి ప్రాబల్య ప్రాంతాల్లోకి మరొకరు ప్రవేశించే సాహసం చేయటం లేదు. అందువల్ల నిరుపేదల జీవనోపాధి తీవ్రంగా దెబ్బతింది. మణిపూర్ హింసాకాండ సాధారణమైనది కాదు. అనేకచోట్ల మహిళలను వివస్త్రలను చేసి, వారిపై అత్యాచారాలకు పాల్పడిన ఉదంతాలు దిగ్భ్రాంతికి గురిచేశాయి. పోలీసు స్టేషన్లపై, సాయుధ రిజర్వ్ బెటాలియన్ స్థావరాలపై దాడులకు దిగి తుపాకులు, మందుగుండు ఎత్తుకుపోయిన ఉదంతాలు కోకొల్లలు. ఈ మొత్తం హింసాకాండలో బీరేన్ సింగ్‌కు కేవలం నైతిక బాధ్యత మాత్రమే కాదు... నేరుగా ఆయన ఒక వర్గానికి వత్తాసుగా నిలిచారని అనేకులు ఆరోపించారు. ఇటీవల బయటపడి, ప్రస్తుతం సుప్రీంకోర్టు పరిశీలనలో ఉన్న సంభాషణల ఆడియో క్లిప్ ఆ ఆరోపణలకు మరింత బలం చేకూర్చింది.కొందరి మతిమాలిన చర్యలవల్లా, పాలకులకు సరైన అంచనా లేకపోవటంవల్లా శాంతి భద్రతలు చేజారే ప్రమాదం ఉంటుంది. కానీ మణిపూర్‌లో జరిగింది వేరు. ఘర్షణలను కుకీ మిలి టెంట్లకూ, కేంద్ర భద్రతా బలగాలకూ మధ్య సాగుతున్న లడాయిగా మొదట్లో బీరేన్ సింగ్ కొట్టి పారేశారు. కానీ దాన్ని అప్పటి రక్షణ దళాల చీఫ్ (సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ ఖండించారు. అవి రెండు తెగలమధ్య కొనసాగుతున్న ఘర్షణలేనని తేల్చిచెప్పారు. ఆ తర్వాత దశలో ఘర్షణలను ఆపడానికి ప్రయత్నిస్తున్న కేంద్ర భద్రతా బలగాలు ఒక వర్గానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నా యంటూ బీరేన్ నిందించారు. విషాదం ఏమంటే 21 నెలలు గడిచినా ఈనాటికీ పరిస్థితి పెద్దగా మారింది లేదు. వాస్తవానికి ఘర్షణలు చెలరేగిన కొన్ని వారాల తర్వాత 2023 జూన్‌లో బీరేన్‌సింగ్ రాజీనామాకు సిద్ధపడ్డారు. కానీ రాజ్‌భవన్ కెళ్లే దారిలో ఆయన మద్దతుదార్లు పెద్దయెత్తున గుమి గూడి అడ్డంకులు సృష్టించి వెనక్కు తగ్గేలా చేశారు. ఇన్నాళ్లకు తప్పుకున్నారు. ఈ పని మొదట్లోనే జరిగుంటే ఈపాటికి పరిస్థితులు మెరుగుపడేవి. సకాలంలో తీసుకోని నిర్ణయం ఊహించని విష పరిణామాలకు దారితీసే ప్రమాదమున్నదని చెప్పటానికి మణిపూర్ పెద్ద ఉదాహరణ. ఇంతకూ బీరేన్ రాజీనామాకు కారణం ఏమిటన్నది మిస్టరీయే. సుప్రీంకోర్టు ధర్మాసనం పరిశీల నలో వున్న ఆడియో టేప్ అందుకు దారితీసి వుండొచ్చని కొందరంటున్నా... మణిపూర్ అరాచకంలోకి జారుకున్నప్పటినుంచీ ఆయనకు సొంత పార్టీలో వ్యతిరేకత పెరుగుతూ వచ్చిందన్నది వాస్తవం. కేబినెట్ సైతం రెండుగా చీలింది. ఒక వర్గం మణిపూర్‌ను విభజించి తాముండే ప్రాంతా లను కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటించాలన్న కుకీల డిమాండ్‌ను సమర్థించగా, మరో వర్గం మణిపూర్ సమగ్రత కాపాడాలంటూ కోరుతూ వచ్చింది. బీజేపీ ఎమ్మెల్యేల్లో కొందరు అసెంబ్లీ స్పీకర్ సత్యబ్రతసింగ్ ఆధ్వర్యంలో ఆదివారం ఇంఫాల్ హెటల్‌లో సమావేశమై బీరేన్‌ను సాగనంపటానికి వ్యూహం రచించగా, సోమవారం నుంచి ప్రారంభం కావాల్సిన అసెంబ్లీ సమావేశాల్లో సర్కారుపై అవిశ్వాస తీర్మానానికి కాంగ్రెస్ నోటీసులిచ్చింది. బీరేన్ తప్పుకున్నాక అసెంబ్లీ సమావేశాలను గవర్నర్ రద్దుచేశారు. బీజేపీ అధిష్టానం అండదండలుంటే అవిశ్వాస తీర్మానానికి బీరేన్ జడిసేవారు కాదు. ఎందుకంటే తొలి ఏలుబడిలో మూడుసార్లు అవిశ్వాస తీర్మానం వచ్చిపడినప్పుడు అసెంబ్లీలో తగినంత బలం లేకున్నా సునాయాసంగా బయటపడిన చరిత్ర బీరేన్‌ది. దేశానికి బలమైన రాజ్యాంగం ఉన్నా మణిపూర్‌లో కొనసాగుతున్న దారుణ హింసను అన్ని వ్యవస్థలూ చేష్టలుడిగి చూస్తూ ఉండిపోయాయి. అది మన దేశంలో అంతర్భాగమని, అక్కడి ప్రజలు కూడా ఈ దేశ పౌరులేనని గుర్తించనట్టే ప్రవర్తించాయి. గవర్నర్ మొదలుకొని న్యాయవ్యవస్థ వరకూ అందరికందరూ మౌనంగా మిగిలారు. ఇలాంటి సమయాల్లో జోక్యం చేసుకోవాల్సిన కేంద్రం తన కర్తవ్యాన్ని మరిచింది. పార్లమెంటులో ఈ సమస్య ప్రస్తావనకొచ్చినప్పుడల్లా అధికార, విపక్ష సభ్యులు పరస్పరం ఆరోపణలు చేసుకోవటం మినహా జరిగిందేమీ లేదు. కనీసం ఇప్పుడైనా అందరూ కదిలి క్షతగాత్రగా మిగిలిన మణిపూర్‌లో ఉపశమన చర్యలు తీసుకుంటారా?మాయమైన మనుషులు, ధ్వంసమైన ఇళ్లు, ఛిద్రమైన బతుకులు, మానప్రాణాలు తీసే మృగాళు ,, జీవిక కోల్పోయి ఎలా బతకాలో తెలియక కుమిలిపోతున్న కుటుంబాలు %–% మణిపూర్ వర్తమాన ముఖచిత్రం ఇది. అందుకే ఆయుధాలు సమకూర్చుకుని అధికారంలో ఉన్నవారి అండదండలతో ఇన్నాళ్లనుంచీ రెచ్చిపోతున్న ముఠాల ఆటకట్టించటం తక్షణావసరం. అసెంబ్లీని సస్పెండ్ చేసి తాత్కాలికంగా రాష్ట్రపతి పాలన విధిస్తారో, మరెవరినైనా ముఖ్యమంత్రి పీఠంపై ఎక్కిస్తారో ఇంకా తేలాల్సేవుంది. ఏం జరిగినా ముందు చట్టబద్ధ పాలనపై ప్రజలకు విశ్వాసం కలిగించే చర్యలు తీసుకోవటం అధికార యంత్రాంగం కర్తవ్యం. అప్పుడే శాంతి సామరస్యాలు వెల్లివిరుస్తాయి. సంక్షుభిత మణిపూర్ మళ్లీ చివురిస్తుంది.

## ఘర్షణాత్మక ఆలోచన...



వాషింగ్టన్,అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అధికారంలోకొచ్చినప్పటినుంచీ మీడియాకు కావలసినంత మేత దొరుకుతోంది. వలసదారులను తిప్పిపంపటంలో ఆ దేశం ఎంత అమానుషంగా, అమానవీయంగా వ్యవహరిస్తున్నదో అందరూ చూశారు. అమెరికాలో 51వ రాష్ట్రంగా ఉండటానికి సిద్ధపడాలంటూ కెనడాను కోరటం, గ్రీన్‌ల్యాండ్ ప్రాంతాన్ని తమకు అమ్మేయాలని డెన్మార్క్‌ను అడగటం, పనామా కాల్వను అప్పగించాలని తాఖీదు పంపటం వగైరాలన్నీ తెలిసీ తెలియక మాట్లాడే మాటలుగా అందరూ కొట్టిపారేశారు. గాజాను స్వాధీనం చేసుకుని దాన్ని ఒక గొప్ప రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుగా అభివృద్ధి చేస్తామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూతో కలిసి గత బుధ వారం మీడియాకు చెప్పడాన్ని సైతం అలాగే భావించారు. సాక్షాత్తూ వైట్ హౌస్ ప్రతినిధే ట్రంప్ వ్యాఖ్యల్ని మీడియా తప్పుగా అర్థం చేసుకున్నదంటూ తోసిపుచ్చారు. అదంతా తాత్కాలిక ఏర్పాటు మాత్రమేనన్నారు. కానీ ట్రంప్ మరోసారి జూలు విదిల్చారు. గాజా స్ట్రిప్ అమెరికాకు కూడా చెందదట. తానే సొంతం చేసుకుంటారట. గాజా పౌరులు నివాసం ఉండటానికి చుట్టూ ఉన్న జోర్డాన్, ఈజిప్టు, సౌదీ, టర్కీ తదితర పశ్చిమాసియా దేశాల్లో ఆరుచోట్ల మెరుగైన కాలనీలు నిర్మిస్తారట. గాజా పౌరులకు ఇక తిరిగొచ్చే హక్కే లేదట. విధ్వంసం తప్ప నిర్మాణం సంగతి తెలియని దేశానికి ఇలాంటి ఆలోచన రావటం వెనకున్న వ్యూహం చిన్నదేం కాదు. తనకు 7,000 కిలోమీటర్ల ఆవల దాదాపు 25 లక్షలమంది నివసించే ఒక ప్రాంతాన్ని 'సొంతం' చేసుకోదల్చుకున్నట్టు ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతుడైన అధినేత ఒకరు ప్రకటించారంటే అదెంత వైపరీత్యమో, అంతకుమించి మరెంత దుస్సాహసమో అర్థం చేసుకోవచ్చు. 2023 అక్టోబర్ మొదలుకొని గత నెలలో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరేవరకూ ఇజ్రాయెల్ సైన్యాలు అక్కడ టన్నులకొద్దీ బాంబులు జార విడిచినా... దారుణ హింసను చవిచూపినా, పసిపిల్లలూ, స్త్రీలతో సహా 47,000 మంది పౌరులను హతమార్చినా, లక్షలమందిని గాయపరిచినా ఆ ప్రాంతం లొంగిరాలేదు. హమాస్ ఆనుపానులన్నీ తెలిశాయని ఇజ్రాయెల్ చెప్పుకున్నా, ఆ సంస్థ అపహరించిన పౌరులందరినీ విడిపించటంలో అది పూర్తిగా విఫలమైంది. చివరకు హమాస్‌తో కుదిరిన ఒడంబడికతోనే వారంతా దశలవారీగా విడు దలవుతున్నారు. ఈ నేపథ్యంలో ట్రంప్ ప్రకటన ఎంత మతిమాలినదో అమెరికా పౌరులు గ్రహించాలి. యుద్ధాలన్నిటినీ అంతం చేస్తానని వాగ్దానాలిచ్చి పీఠం అధిష్టించిన అధినేత కొత్త కుంపట్లు రాజేయటంలోని మర్మమేమిటో నిలదీయాలి. అమెరికాతో చెట్టాపట్టాలేసుకున్న పశ్చిమాసియా దేశాలు మాత్రమే కాదు... భద్రతామండలి దేశాలన్నీ ట్రంప్ ప్రతిపాదనను ఖండించాయి. సుతిమెత్తగానే అయినా 'ఇది యుద్ధాల యుగం కాద'ని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. 1948లో పశ్చిమాసియాలో ఇజ్రాయెల్‌కు ప్రాణప్రతిష్ఠ చేసి పాలస్తీనా పేరిట వదిలిన ఒక చిన్న ప్రాంతాన్ని సైతం ఇప్పుడు ట్రంప్ ఆక్రమిద్దామని చూస్తు న్నారు. అంతరంగంలో ఏమనుకున్నా 'రెండు దేశాల' ఏర్పాటే సమస్యకు పరిష్కారమని పైకి చెబుతూ వచ్చిన అమెరికా... ట్రంప్ ఏలుబడి మొదలయ్యాక తన నైజాన్ని బయటపెట్టుకుంది. పాలకులెవరైనా, పైకి ఏం చెప్పినా అమెరికా విధానాలు యుద్ధాలకూ, ప్రత్యేకించి ఇజ్రాయెల్‌కు అనుకూలమైనవే. చరిత్ర వరకూ పోనవసరం లేదు. గత 15 నెలలుగా గాజాలో ఇజ్రాయెల్ సాగించిన నర మేధం అమెరికా ఆశీస్సులు లేకుండా జరిగే అవకాశం ఉందా? రష్యాను కవ్వించి కయ్యా నికి కాలు దువ్వమని ఉక్రెయిన్‌ను ప్రోత్సహించి ఓడిపోక తప్పని యుద్ధంలోకి దాన్ని దించిన ఘనత గత పాలకుడు జో బైడెన్‌ది. ఒకప్పుడు సోవియెట్ బూచిని చూపి ప్రత్యక్ష పరోక్ష యుద్ధాలకు దిగిన అమెరికా ఇవాళ ప్రపంచ దేశాలన్నిటినీ శత్రువులుగా చూస్తోంది. వేరే దేశాల సరుకులపై భారీ సుంకాలు మోపుతూ, వాటిని దివాలా తీయించటం ఒకవైపు... 'నచ్చిన ప్రాంతం' సొంతం చేసుకుంటానంటూ మరోవైపు ప్రపంచాన్ని ట్రంప్ అస్థిరతలోకి నెడుతున్నారు. ఈ సంస్కృతినే రష్యా, చైనాలు కొనసాగిస్తే ఏం జరుగుతుందో ఆయనకు అర్థమవుతున్నట్టు లేదు. ప్రపంచ దేశాలన్నీ తన జాగీరుగా ఆయన భావిస్తున్నారు. పొట్టచేతబట్టుకు వచ్చిన వలసదారులను అమెరికాలో నేరస్తులుగా పరిగణించే ట్రంప్ తన విస్తరణవాద కాంక్షను ఏమనాలో, అందుకు శిక్షేమిటో చెప్పాలి. అమెరికా దయాదాక్షిణ్యాలపై ఆధారపడిన జోర్డాన్, ఈజిప్టులు రెండూ ట్రంప్ ప్రతిపాదనను తోసిపుచ్చాయి. కానీ ప్రస్తుతం అమెరికాలో పర్యటిస్తున్న జోర్డాన్ రాజు అబ్దుల్లా 2 ట్రంప్ హుంక రింపులను తట్టుకుని నిలబడగలరా? అనుమానమే. ఎందుకంటే అమెరికానుంచి సైనిక, ఆర్థిక సాయం పొందుతున్న దేశాల్లో జోర్డాన్‌ది మూడో స్థానం. ఆ దేశానికి ఏటా 1,700 కోట్ల డాలర్ల ప్యాకేజీ అందుతుంది. 1,500 కోట్ల డాలర్లతో తర్వాతి స్థానం ఈజిప్టుది. అమెరికా నుంచి 17,200 కోట్ల డాలర్ల సాయం పొందుతూ ప్రస్తుతం ఉక్రెయిన్ ప్రథమస్థానంలో వున్నా అదెంతో కాలం సాగకపోవచ్చు. 3,300 కోట్ల డాలర్లతో ఇజ్రాయెల్ రెండో స్థానంలో ఉంది. ట్రంప్‌కు మోకరిల్లితే ఈజిప్టు, జోర్డాన్ ప్రజలు మౌనంగా ఉండరు. ఇప్పటికే గాజా శరణార్థులతో నిండివున్న ఆ దేశాల్లో మరింతమందిని తీసుకొస్తామంటే ఆగ్రహజ్వాలలు మిన్నంటుతాయి. అందుకే అక్కడి పాలకుల స్థితి ముందు నుయ్యి, వెనక గొయ్యిగా ఉంది. గాజాను పునర్నిర్మించాల్సిందే. సర్వం శిథిలమైన చోట మెరుగైన ఆవాసాలు ఏర్పాటు కావాల్సిందే. కానీ అదంతా అక్కడి పౌరుల చేతుల మీదుగా జరగాలి. అమెరికాతో సహా బయటి దేశాలకు అక్కడ కాలుమోపే హక్కులేదు.

### అసెంబ్లీకి రావాలంటే జంకుతున్న జగన్

అమరావతి,వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డికి ఏపీ అసెంబ్లీ అంటే భయమని అసెంబ్లీ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. ప్రతిపక్ష నాయకుడు హెూదా ఇస్తేనే వస్తానని జగన్ అంటున్నారన్నారు. మంగళవారం జీవీ ఆంజనేయులు మీడియాతో మాట్లాడారు. 22, 23 తేదీల్లో ఈ నెలలో శాసన సభ్యులకు ప్రత్యేక అవగాహన తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 22వ తేదీన ఓం బిర్లా లోక్‌సభ స్పీకర్, 23వ తేదీన మాజీ ఉపరాష్ట్రపతి ఈ కార్యక్రమాల్లో పాల్గొంటారని చెప్పారు. ఎమ్మెల్యేలకు ఓరియంటేషన్ ఏర్పాటు చేసినందుకు అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు, సీఎం చంద్రబాబులకు దన్యవాదాలు తెలిపారు. అటెండెన్స్ విషయంలో విప్‌లు పూర్తి స్థాయి శ్రద్ధ పెట్టాలని నిర్ణయించామన్నారు. ప్రతిపక్ష నాయకుడు ప్రతిపక్షంలోకి రాలేకపోయారని చెప్పారు. అసెంబ్లీకి కూడా జగన్ రాలేదని చెప్పారు. అందుకే ప్రతిపక్ష, అధికార పార్టీ బాధ్యతలు రెండు విజయవంతంగా తామే నిర్వహిస్తామన్నారు. ఇంటిదగ్గర ఉండే ప్రశ్నలు వేస్తానని జగన్ అంటున్నారని... ఇలాంటి విధానం గతంలో ఎన్నడూ లేదని చెప్పారు. సభకు వస్తే సమాధానం చెప్పడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. ప్రతిపక్ష నాయకుడికి ఇంగితం లేదని విమర్శించారు. గతంలో జగన్ టీడీపీ నుంచి ఒకరిద్దరిని వైసీపీలోకి తీసుకుంటే ప్రతిపక్ష హెూదా పోతుందని అనలేదా అని నిలదీశారు.

## హెచ్ఐవి టెస్ట్ చేయించుకున్న బ్రిటన్ ప్రధాని

లండన్, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ హెచ్ఐవీ పరీక్షను చేయించుకున్నారు. జీ7 నాయకుల్లో బహిరంగంగా హెచ్ఐవీ పరీక్ష చేయించుకున్న మొదటి ప్రధాని స్టార్మర్ అని ఆయన కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది. ఈసందర్భంగా దేశ ప్రజలంతా ముందుకొచ్చి టెస్టులు చేయించు కోవాలని పిలుపునిచ్చింది. 'హెచ్ఐవీ పరీక్ష వార్షికోత్సవం సందర్భంగా ప్రధాని స్టార్మర్ హెచ్ఐవీ టెస్టు చేయించుకున్నారు. టెరెన్స్ హిగ్గిన్స్ సంస్థతో కలిసి ర్యాపిడ్ హోమ్ టెస్టు చేయించుకున్నారు' అని ఓ ప్రకటనలో పేర్కొంది. హెచ్ఐవీ పరీక్ష ఎంతో ముఖ్యమైనదని, ఇందులో పాల్గొనడం తనకు ఆనందంగా ఉందని స్టార్మర్ వెల్లడించారు. క్షణాల్లో జరిగిపోయే ఈ పరీక్షను వారం రోజులపాటు ఉచితంగా పొందవచ్చన్నారు. 2030 నాటికి కొత్త హెచ్ఐవీ కేసులు నమోదుకాకూడదనే లక్ష్యాన్ని చేరుకునేందుకు.. ప్రజలు ముందుకొచ్చి టెస్టు చేయించుకోవాలని కోరారు. 2030 నాటికి ఒక్క హెచ్ఐవీ కేసు నమోదు కాకూడదనే లక్ష్యానికి స్టార్మర్ కట్టుబడి ఉన్నట్లు ప్రధాని కార్యాలయం తెలిపింది. దీనికి సంబంధించి ఈ ఏడాదిలో ఒక యాక్షన్ ఎ÷–లాన్ సైతం రూపొందించినట్లు వెల్లడించింది.

## పౌర్ణమి రోజు నదీ, సముద్రస్నానాలకు శ్రేష్ఠం

ప్రయాగరాజ్, మాఘ పూర్ణిమ.. కారణంగా కుంభమేళాకు మరింతగా భక్తులు పోటెత్తనున్నారు. ఇప్పటకే రోజుకు కోటిన్నర వరకు పుణ్యస్నానాలకు వస్తున్నారని అంచనా. ఈ నెల 12న మాఘపూర్ణిమ కారణంగా మరింత రద్దీ పెరగనుంది. ఇప్పటికే వందల కిలోమీటర్లు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. హిందూ పురాణాల ప్రకారం ఈ రోజుకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఈ రోజున భగవంతుడిని భక్తి శ్రద్ధలతో పూజించడం వల్ల ఆర్థిక బాధలు తొలగి అష్టైశ్వర్యాల సిద్ధి కలుగుతుందని చెప్తారు. పౌర్ణమి నాడు బ్రహ్మ ముహూర్తంలో స్నానం చేసి సూర్య భగవానుడికి అర్ఘ్యం అర్పించడంఅ వసరమని అంటున్నారు. దీంతో త్రివేణి సంగమానికి భక్తులు పోటెత్తనున్నారు. స్నానానంతరం పూజా కైంకర్యాలను నిర్వహించుకోవడం ఆనవాయితీ. వీలైతే ఏదైనా దేవాలయాన్ని సందర్శించడం వల్ల శుభం కలుగుతుంది. ఈ రోజున చేసే గంగా స్నానానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. కానీ, ఇది అందరికీ సాధ్యపడకపోవచ్చు. కాబట్టి వీలైనవారు నదీ స్నానం చేసుకుని శివకేశవులను ఆరాధించుకోవచ్చు. మాఘ పౌర్ణమి రోజున మద్య మాంసాలకు దూరంగా ఉండాలి. ఎట్టిపరిస్థితుల్లో జీవహింస చేయరాదు. ఇనుప వస్తువులు, నల్లని బట్టలు, వెండి, పాలు, ఉప్పు, సూదులు, కత్తెరలు వంటి పదునైన వస్తువులు బయటకు ఇవ్వకూడదు. ఇలా చేయడం వల్ల శని, చంద్ర దోషాలు వస్తాయని చెప్తారు. వీలైతే వంటకాల్లో ఉల్లి, వెల్లుల్లిని తీసుకోకుండా ఉండాలి. మీ భోజనం మీరే వండుకోవడానికి ప్రయత్నించండి. ఇక ఇతరులను మోసగించడం, దూషించడం, శారీరకంగా, మాటలతో గానీ హింసించడం వంటివి చేయకూడదు. ఇతరులను అకారణంగా నిందించకూడదు. నల్ల దుస్తులు ధరించకూడదు. రాత్రి ఎక్కువ సమయం వరకు మేలుకుని ఉండకూడదు. ఈ రోజు కచ్చితంగా బ్రహ్మ ముహూర్తంలో స్నానం ఆచరించడానికి ప్రయత్నించడం మంచిదని అంటున్నారు. ఇది ఎంతో శ్రేష్ఠమైనదిగా నమ్ముతారు. అవసరంలో ఉన్నవారికి, పేదవారికి అన్న, వస్త్ర దానాలు చేయడం చాలా మంచిది. విష్ణు మూర్తిని పూజించడం, పౌర్ణమి వెన్నెల్లో విష్ణు సహస్రనామం జపించడం ఎంతో మేలు చేస్తుంది. ఈ రోజు చేసే ఉపవాసం వల్ల ఎంతో పుణ్యం కలుగుతుందని శాస్త్రాలు చెప్తున్నాయి.రోజున ఆహారం దానం చేసిన వారికి జీవితంలో ధనానికి, తిండికి లోటు ఉండదని నమ్ముతారు. లక్ష్మీదేవి వారింటిని ఐశ్వర్యంతో నింపుతుందని నమముతారు. పౌర్ణమి రోజున సౌందర్య సాధనాలను దానం చేయడం వల్ల భర్త పిల్లల ఆయుష్షు పెరుగుతుందని ఉత్తరాది ప్రజలు నమ్ముతారు. ఇలా చేయడం వల్ల లక్ష్మీ దేవి ప్రసన్నం కలుగుతుందని నమ్ముతారు. మాఘపౌర్ణమి సందర్భంగా కూడా కుంభస్నానానికి వస్తారు. మౌని అమావాస్యతో పాటు ఈరోజుకు కూడా విశేష ప్రాధాన్యం ఉంది.

## మాస్ లీడర్స్ నా ?

అమరావతి,వైసీపీ నుంచి ఇప్పటికి నలుగురు ఎంపీలు బయటకు వెళ్ళారు. మరి కొందరు ఆ లిస్ట్ లో ఉన్నారు అని ప్రచారం సాగుతోంది. అయితే దీని వల్ల వైసీపీకి రాజకీయంగా దెబ్బ పడుతుందా అన్నది కూడా అంతా చర్చించుకుంటున్నారు. నిజానికి ప్రతిపక్షంలో ఉన్న పార్టీకి ఇలాంటివి దెబ్బగానే చూస్తారు. కానీ అలా వెళ్తున్న వారు అంతా ఎవరు అన్నది కూడా చూస్తారు. మాస్ లీడర్లు ఎవరైనా పార్టీని వీడినపుడు అతి పెద్ద చర్చ అవుతుంది. వైసీపీలో చూస్తే కనుక వెళ్ళిన వారి గురించి వైసీపీ ఫ్యూచర్ గురించి చర్చ సాగుతోంది. ఆర్ క్రిష్ణయ్య : ఇక ఒకసారి చూసుకుంటే వైసీపీ దారుణమైన ఓటమిని మూటకట్టుకుని ఎనిమిది నెలలు అయింది. ఈ మధ్యలో వైసీపీ నుంచి ఏకంగా నలుగురు రాజ్యసభ సభ్యులు పార్టీని వీడారు. వీరిలో ఆర్ క్రిష్ణయ్యది అసలు ఆంధ్రప్రదేశ్ కానే కాదు ఆయన తెలంగాణాకు చెందిన వారు. ఆయనను తీసుకుని వచ్చి వైసీపీ అధినేత జగన్ రాజ్యసభ సీటు ఇచ్చారు. కనీ ఆయన మాత్రం పార్టీ ఓడిపోగానే రాజీనామా చేశారు. తాను రాజకీయాలకు దూరంగా ఉంటానని బీసీ ఉద్యమాన్ని తిరిగి నిర్మిస్తాను అని చెప్పారు. అయితే చిత్రంగా ఆయన బీజేపీలో చేరడం ఆ పార్టీ తరఫున ఎంపీ కావడం అన్నది జరిగిపోయింది. ఈయన రాజీనామా వల్ల వైసీపీకి ఒక ఎంపీ సీటు తగ్గింది కానీ పార్టీ పరంగా రాజకీయంగా పెద్దగా నష్టం జరిగింది లేదనే అంటున్నారు. పైగా ఈయనకు ఓటు బ్యాంకు ఏపీలో లేదు అన్నది చెబుతున్న మాట.

బీద మస్తాన్ రావు : మరో వైపు చూస్తే బీద మస్తాన్ రావు అన్నాయన పార్టీని వీడిపోయారు. ఈయన బేసికల్ గా తెలుగుదేశం పార్టీకి చెందిన వారు అక్కడ రాజ్యసభ సీటు కోసం ఎంతగానో ప్రయత్నం చేశారు. కానీ దక్కలేదు. ఆయన వైసీపీలోకి వచ్చి సీటు సాధించారు. ఇలా పార్టీ ఓడగానే అలా వైసీపీని వీడి మళ్ళీ టీడీపీలో చేరారు. ఆయన కూడా పార్టీ నుంచి మళ్ళీ అదే సీటు సాధించారు. ఈయన కు పెద్దగా అనుచర గణం లేదు. ఓటు బ్యాంక్ లేదు. పైగా బిజినెస్ మాన్. ఈయన వల్ల వైసీపీకి రాజకీయంగా ఇబ్బందులు ఉంటాయా అంటే సీటు పోవడం వేరేది ఉండదని అంటున్నారు.మోపిదేవి వెంకటరమణ : అలాగే మోపిదేవి వెంకట రమణ వైసీపీ రాజ్యసభ సీటు ఇస్తే పార్టీని వీడి వెళ్ళారు. ఈయన 2014, 2019లలో రెండుసార్లు ఎమ్మెల్యేగా ఓడినా మంత్రిని చేశారు. ఆ మీదట పెద్దల సభకు పంపించారు. అయితే ఎలాంటి విశ్వాసం లేకుండా ఆయన పార్టీని వీడి వెళ్ళిపోయారు. వరసగా రెండు సార్లు ఓడిన ఆయనకు ప్రత్యేకంగా ఓటు బ్యాంకు ఏమి ఉంటుంది అన్నది కూడా చర్చగా ఉంది.విజయసాయిరెడ్డి : ఇక వి విజయసాయిరెడ్డి. ఈయన వైసీపీలో మొత్తం తానే అన్నట్లుగా వ్యవహరించారు. నిజానికి ఈయన పొలిటీషియన్ కానే కాదు. వైఎస్సార్ కుటుంబానికి ఆడిటర్ కాబట్టి జగన్ తో పాటుగా జైలుకు వెళ్ళారు కాబట్టి ఆయనకు ఎక్కువ విలువ ఇచ్చారు జగన్. ఈయన తాను పొలిటికల్ గా బిగ్ ఫిగర్ అనుకుని బయటకు వెళ్ళారని అంటున్నారు. తాను వెళ్తే తన వెంట చాలా మంది వస్తారని భావించారని చెబుతారు. అయితే ఏ ఒక్కరూ వెళ్ళలేదు. దాంతో ఆయన పప్పులో కాలు వేశారు అని అంటున్నారు.

# మాస్టర్‌ప్లాన్‌ను రైతులకనుగుణంగా మార్చాలి

హైదరాబాద్,హెచ్‌ఎండీఏ మాస్టర్ ప్లాన్‌ను పునఃసమీక్షించి రైతులకు అనుగుణంగా జోన్లను నిర్ణయించాలని మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు గండిమైసమ్మ చౌరస్తాలోని బీజేపీ కార్యాలయంలో మండల బీజేపీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించి, వివరాలు వెల్లడించారు. 11 సంవత్సరాలుగా జోన్ మార్పులకు నోచుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం హెచ్‌ఎండీఏ పరిధిలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, భువనగిరి జిల్లాల్లోని 70 మండలాలు, 24 మున్సిపాలిటీలు, 8 మున్సిపల్ కార్పొరేషన్లు, దాదాపు 7 వందల గ్రామాలున్నాయన్నారు. ఈ మాస్టర్ ప్లాన్ రైతుల పాలిట శాపంగా మారిందన్నారు. మాస్టర్‌ప్లాన్‌లో భూములను పలు రకాలైన జోన్లుగా విభజించారన్నారు. దీని కారణంగా రైతులు తమ భూముల్లో సొంత ఇళ్లు కూడా నిర్మించుకునే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. ఈ గ్రోత్ కారిడార్‌లో భూమి ఉన్నా కుటుంబం గడవని దయనీయ పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే రైతులకు తమ భూమి తమకు ఉపయోగపడే విధంగా మార్పులు చేయాలని బీజేపీ తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉన్న ఈ ప్లాన్ తక్షణమే మార్చాలన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మండల బీజేపీ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి, జిల్లా బీజేపీ కార్యదర్శిం దుండిగల్ విఘ్నే శ్వర్, మండల మాజీ అధ్యక్షుడు గోనే మల్లారెడ్డిలు ఉన్నారు.

# వేసవికి ముందే భానుడి భగభగలు

హైదరాబాద్,వేసవి ప్రారంభానికి ముందే సూర్యుడు సుర్రుమంటున్నాడు. ఉదయం 8 గంటల నుంచే భానుడు దంచి భగభగమంటున్నాడు. మధ్యాహ్నం సమయాల్లో అయితే రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. చాలా ప్రాంతాల్లో 35 డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కాగా, రానున్న రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరుగుతుందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. హైదరాబాద్ నగరంతో పాటుగా.. తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో రాబోయే మూడు నుండి 5 రోజుల పాటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని చెప్పారు. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 38 డిగ్రీల సెల్సియస్‌కు, ఇతర జిల్లాల్లో 40 డిగ్రీల సెల్సియస్‌కు పెరిగే అవకాశం ఉందన్నారు. రాబోయే రోజుల్లో తీవ్రమైన వేడి ప్రజల్ని ఉక్కిరిబిక్కిరి చేయటం ఖాయమని అంటున్నారు. తెలంగాణ వ్యాప్తంగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2-4 డిగ్రీల సెల్సియస్ మేర ఎక్కువగా నమోదవుతాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ -హైదరాబాద్) అంచనా వేసింది. సోమవారం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 34 నుంచి 35 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదయ్యాయని చెప్పింది. ఇంకా ఈ ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తూర్పు, ఉత్తర తెలంగాణ జిల్లాల్లో 38 డిగ్రీల నుండి 40 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతాయని.. హైదరాబాద్ నగరంలో 36 డిగ్రీల సెల్సియస్ నుండి 38 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు రికార్డవుతాయని అంటున్నారు. ఫిబ్రవరి 19 లేదా 20 వరకు కనీసం 5 రోజుల పాటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఉంటాయన్నారు. ఆ తర్వాత ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గే అవకాశం ఉందని వెల్లడించారు. కాగా, ఫిబ్రవరిలోనే ఎండల తీవ్రత ఇలా ఉంటే ఇక రాబోయే రోజుల్లో పరిస్థితి దారుణంగా ఉంటుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

# బాయ్ కాటే!

హైదరాబాద్,ఎవరి అభిప్రాయాలు వారివి, దేశంలో మాట్లాడే హక్కు రాజ్యాంగమే కల్పించింది. అందులో తప్పులేదు. "నేను ఫలానా, నేను ఫలానా వారి కోసమే బతుకుతున్నా" అని చెప్పుకునేవారు కొందరున్నారు. కానీ వారు మాట్లాడే వేదిక ముఖ్యం. పెళ్లికి వచ్చి చావుడప్పు కొడితే ఎలా ఉంటుంది? అలాగే, ఒక వేదికపై ఉన్నప్పుడు ఆ వేదిక ఎందుకోసం పెట్టారు? ఎందుకు వచ్చాము? అనే ఇంగిత జ్ఞానం ఉంటే చాలు, ఆ ఫంక్షన్ బాగుంటుంది. ఇప్పుడు టాలీవుడ్‌లో కొంతమంది ఓవర్‌యాక్షన్ వల్ల మొత్తం ఇండస్ట్రీకే దెబ్బ పడేలా కనిపిస్తోంది. ఇందులో చిన్న పెద్ద నటులు, నిర్మాత అనే భేదం లేకుండా ఉంది.ముఖ్యంగా ఇటీవలి కాలంలో కొందరు చేస్తున్న ఓవర్‌యాక్షన్ వల్ల ఒక వర్గం వారికి సినిమాలు అంటే విరక్తి వచ్చేలా ఉంది. అందులో ముఖ్యంగా కొంతమంది గురించి మాట్లాడుకుంటేపృథ్వీ:30 ఇయర్స్ ఇండస్ట్రీగా కష్టపడి కాస్త గుర్తింపు తెచ్చుకోగానే రాజకీయాల వైపు ఆసక్తి మళ్లింది. అందులో తప్పులేదు. ముందుగా వైసీపీని సపోర్ట్ చేశాడు. అందుకు ప్రతిఫలంగా వైసీపీ అధికారంలోకి రాగానే మంచి పదవి ఇచ్చారు. తీరా ఆయనే చేసుకున్న స్వయంఅపరాధం వల్ల పదవి ఊడిపోయింది. దీంతో అప్పటి వరకు బూతులు తిట్టిన పార్టీ కండువా కప్పుకుని జగన్‌ను తిట్టడం మొదలు పెట్టాడు. ఇందులోనూ తప్పులేదు.రాజకీయ నాయకుడిగా రాజకీయ వేదికపై విమర్శలు చేయడం పరిపాటి. కానీ సినిమా వేదికపై ఉంటూ రాజకీయ విమర్శలు చేయడంతో తిట్టించుకున్న పార్టీ ఆ సినిమాను టార్గెట్ చేస్తోంది. మొదటగా గేమ్ ఛేంజర్ సినిమా ఫంక్షన్‌లో మాట్లాడిన మాటల వల్ల రామ్‌చరణ్ టార్గెట్ అయ్యారు. తర్వాత అయినా సైలెంట్‌గా సినిమా గురించి మాట్లాడకుండా లైలా ఫంక్షన్‌లో మళ్లీ వైసీపీ వారిని రెచ్చగొట్టారు. దీంతో "బాయికాట్ లైలా" అంటూ పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. చివరికి నష్టనివారణగా సినిమా హీరో, నిర్మాతలు మీడియా ముందుకు వచ్చి క్షమాపణ చెప్పారు.హైపర్ ఆది:చాలా కష్టపడి జబర్దస్త్ ద్వారా సినిమా రంగ ప్రవేశం చేసి, మంచి కమెడియన్‌గా పేరు తెచ్చుకున్న ఆది కూడా తనకు ఇష్టం ఉన్న రాజకీయ పార్టీని ఎంచుకున్నాడు. తమ నాయకుడి కోసం కష్టపడడం తప్పు కాదు. కానీ, అప్పుడప్పుడూ సినిమా వేదికపై తన కామెడీ స్క్రిప్ట్‌లలో వైసీపీని టార్గెట్ చేస్తూ కామెడీ చేయడంతో ఆయనపై, ఆయన నటించే సినిమాపై కూడా వైసీపీ వారు టార్గెట్ చేయడం మొదలు పెట్టారు. ఆయన వల్ల రెండు మూడు సినిమాలు పెద్ద ఎత్తున నష్టపోయిన విషయం తెలిసిందే.సాయిధరమ్ తేజ్:చెప్పాలంటే సాయిధరమ్ తేజ్ పెద్ద తప్పు ఏమీ చేయలేదు. 2024 ఎన్నికల్లో కూటమి గెలిచిన తర్వాత "ఏపీ సేఫ్ హ్యాండ్‌లో ఉంది" అంటూ తన మామయ్య పవన్ కళ్యాణ్ ఫోటో పెట్టుకుని సంతోషం వ్యక్తం చేస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టాడు. ఇంతవరకు ఓకే. కానీ, రాష్ట్రంలో అమ్మాయిలపై జరుగుతున్న దారుణాలపై వైసీపీ నేతలు సోషల్ మీడియాలో సాయిధరమ్ తేజ్‌ను ట్యాగ్ చేసినప్పుడు ఆయన రియాక్ట్ అయిన విధానం తప్పుగా మారింది.దీంతో అప్పటి నుండి రాష్ట్రంలో ఏ చిన్న వివాదం జరిగినా సాయితేజ్‌ను ట్యాగ్ చేస్తున్నారు. ఆయన సినిమా వచ్చినప్పుడు తప్పకుండా వైసీపీ నుంచి ట్రోలింగ్ తప్పకపోవచ్చు. అశ్వినీదత్ - కీరవాణి:పెద్ద నిర్మాతగా, టీడీపీకి వీరాభిమానిగా అశ్వినీదత్ అందరికీ పరిచయం. ఈయన గారు కూడా సమయం, సందర్భం లేకుండా జగన్‌పై వ్యక్తిగతంగా మాట్లాడుతూనే ఉంటారు. ఆయన సినిమాలపై కూడా వైసీపీ టార్గెట్ ఉండనే ఉంది.ఇక కీరవాణి గురించి చెప్పాల్సిన పని లేదు. పెద్ద మేధావిగా భావించే ఈయన, ఓ మీటింగ్‌లో "చనిపోయిన వారిని పొగడాల్సి పోయి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కబంధ హస్తాల్లోంచి కల్లారా చూసిన తర్వాతే

# ఇలా చేసి.. టీడీపీ బావుకునేదేమిటి!

అమరావతి,రాజకీయంలో రోజులు మారిపోయాయి. బహుశా ఇది జరిగి కూడా చాలా కాలం గడిచిపోయింది. స్థానిక సంస్థల వ్యవహారాలు అయితే మరింత కామెడీ అయిపోయాయి. ఒక్క కార్పొరేటర్ కూడా గెలవని కార్పొరేషన్లలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ పాగా వేయగలదు! అవకాశం దొరికితే చాలు.. బలాబలాలను అటుఇటూ చేయడం అధికారంలో ఉన్న వారికి చిటికెలో పని. ఇందు కోసం సామదానబేధదండోపాయాలను ఉపయోగించడం రాజకీయ పార్టీలకు, రాజకీయ నేతలకు ఏ మాత్రం కష్టం కాదు. ఈ విషయంలో భౌతికదాడులకు, బుల్డోజర్లకు పని చెప్పడానికి, రోడ్లపై రచ్చలు చేయడానికి కూడా వెనుకాడటం లేదు.ఏపీలో తెలుగుదేశం కూటమికి ప్రజలు పూర్తి అధికారం ఇచ్చారు. ఏకంగా 164 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆ పార్టీ ఎమ్మెల్యేలకు రాజ్యాన్ని అప్పగించారు ప్రజలు. కూటమి రూపంలో అయినా.. ఇంతమంది ఎమ్మెల్యేలు అధికార పక్షంలో ఉండటంలో విభజన తర్వాత తొలి సారి ఇదే. ఇక అధికారం దక్కిన వెంటనే రాజ్యసభ సభ్యుల మీద తెలుగుదేశం పార్టీ కన్నేసినట్టుగా ఉంది.గతంలో అయితే.. ఎంపీలకు కండువాలు మార్చేసి వారిని చేర్చుకోవడానికి టీడీపీ ఉత్సాహం చూపింది. 2014 నుంచి 2019 మధ్యన తెలుగుదేశం పార్టీ 23 మంది ఎమ్మెల్యేలను, ఇంకా ఎంపీలను కూడా చేర్చుకుని తమ రాజకీయ బలం పెరిగినట్టుగా ఫీలయ్యింది. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి వచ్చిన వారందరినీ చేర్చుకుంది. దీని కోసం ఒక మిషన్ నే నడిపింది. అలా ఎమ్మెల్యేలను చేర్చేసుకుంటే ఆ పార్టీ వీక్ అయిపోతుందని చంద్రబాబు నమ్మినట్టుగా ఉన్నారు అప్పట్లో! అయితే ఆ తర్వాత ఏం జరిగిందో తెలిసిన సంగతే. 23 మంది ఎమ్మెల్యేలను చేర్చుకుంటే.. ఆ తర్వాతి ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి సొంతంగా 23 మంది ఎమ్మెల్యేలను నెగ్గించుకోవడం కష్టం అయ్యింది!ప్రజాస్వామ్యంలో నేతలను, ఎమ్మెల్యేలను, ఎంపీలను చేర్చుకునేస్తే ఒక పార్టీ వీక్ కావడమో, అడ్రస్ కోల్పోవడమో జరగదు అని నాటి ఎన్నికల ఫలితాలు నిరూపించాయి. ప్రజాస్వామ్యంలో ప్రత్యామ్నాయానికి ఎప్పుడూ అవకాశం ఉంటుందని, ఆ విషయంలో ప్రజలు అలర్ట్ గా ఉంటారని.. ఏ పార్టీని ప్రజలు పూర్తిగా చంపేయరని, ఏ పార్టీకి అయినా వారు ఎప్పుడైనా జీవం పోయగలరని.. అనేక సార్లు రుజువు అయ్యింది. స్వయంగా టీడీపీ విషయంలో కూడా ఇది జరిగింది. చంద్రబాబు కథ అయిపోయిందనుకున్న ప్రతిసారీ ఏదో అవకాశం ద్వారా ఆ పార్టీ అధికారాన్ని చేపట్టింది కూడా! కాబట్టి.. చంద్రబాబులా ఎమ్మెల్యేలను, ఎంపీలను చేర్చేసుకోవడం ద్వారా కానీ, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరహాలో స్థానిక సంస్థల ఎన్నికలను ఏకపక్షం చేసుకోవడం ద్వారా కానీ ఎలాంటి ప్రయోజనాలు ఉండవని ఇరు పక్షాలు నీతి నేర్చుకోవచ్చు!23 మంది ఎమ్మెల్యేలను గుంజేసుకున్న టీడీపీ ఆ తర్వాత ఇరవై మూడుకే మిగిలింది. స్థానిక సంస్థల్లో ఏకగ్రీవంగా నెగ్గిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు అవే స్థానిక సంస్థల విషయంలో ప్రత్యర్థి పార్టీకి ఒక్క స్థానంలో లేకపోయినా చైర్మన్ పీఠాలను సొంతం చేసుకుంటే ఖిన్నురాలు అవుతోంది! నేతలు అనేవారు తక్కెడల్లోని కప్పల్లాంటి వారని, అధికారం ఎటు ఉంటే వారు అటు చేరిపోవడమే తప్ప ఇంకో నీతి లేదని ఇందుమూలంగా అర్థం అవుతోంది. అయితే చెరో దెబ్బపడినా.. టీడీపీ పరిస్థితిని మళ్లీ మొదటకు తీసుకువస్తుండటం విశేషం!వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలను డైరెక్టుగా చేర్చేసుకుంటే గతంలాగా చెడ్డ పేరు వస్తుందని ఈ సారి తెలుగుదేశం పార్టీ తెలివి మీరిన పని చేస్తోందనే విశ్లేషణ వినిపిస్తూ ఉంది. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున రాజ్యసభ సభ్యుల హోదాలోని నేతలు వరసగా రాజీనామాలు చేశారు. వారి రాజీనామాలతో ఆ స్థానాలు తక్షణం ఖాళీ అయ్యాయి. వారి స్థానంలో అసెంబ్లీ బలాలను బట్టి తెలుగుదేశం పార్టీ తమ వారిని నామినేట్ చేసుకోగలుగుతూ ఉంది. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున రాజ్యసభ సభ్యుల హోదాలో ఉన్న వారి తిరిగి వచ్చి చేరితే కూడా తమకు నచ్చిన వారికి అవకాశం ఇస్తూ ఉంది. నచ్చని వారికి మాత్రం ఆ అవకాశం లేదు! గతంలో లోక్ సభ సభ్యులను డైరెక్టుగా చేర్చుకుంటే నష్టమే జరిగింది కాబట్టి, ఇప్పుడు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యుల చేత రాజీనామా చేయించి తెలుగుదేశం తమ వారితో దాన్ని భర్తీ చేసుకుంటూ ఉంది! తద్వారా తాము జీరో గా ఉండిన రాజ్యసభలో తమ ఉనికి మళ్లీ పెంపొందించుకుంటూ ఉంది తెలుగుదేశం పార్టీ!అయితే నీవు నేర్పిన విద్యే నీరజాక్ష అన్నట్టుగా.. ఇలాంటి వ్యూహాలే రేపు మళ్లీ ప్రత్యర్థులు అధికారంలోకి వస్తే ప్రయోగించరని అనడానికి ఏమీ లేదు! రేపు మళ్లీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కి అధికారం దక్కితే ఇలాంటి వ్యూహాలే అవలంభిస్తుంది. ఈ రోజు చేసినదానికి ప్రతీకారం అన్నట్టుగా అంతకు మించి ఇలాంటి వ్యూహాలను అమల్లో పెడుతుంది తప్ప ఎక్కడా తగ్గదు. ఇప్పుడు తెలుగుదేశం చేస్తోంది అదే.. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు తమను వేధించారంటూ.. ఇప్పుడు కక్ష సాధింపు చర్యల విషయంలో తెలుగుదేశం పార్టీ తీవ్ర స్థాయికి వెళ్లిపోయింది.ఇప్పుడు అధికారం ఉంది కాబట్టి.. ఏం చేసినా చెల్లుతుంది.



అయితే అధికారంలో ఉన్న వారికి ఉండే కాన్ఫిడెన్స్ ఏమిటంటే.. అది ఎప్పుడూ తమ వద్దే ఉంటుందని అనుకుంటారు. గతంలో జగన్ అయినా, ఇప్పుడు తెలుగుదేశం పార్టీ అయినా.. అధికారం ఎప్పుడూ తమదే అని భావిస్తూ ఉంటారు. ఆ భ్రమల్లోనే ఉంటారు. వారిని ఆ భ్రమల్లో ఉంచడానికి అనేక మంది నిర్విరామంగా కృషి చేస్తూ ఉంటారు. వారిని నమ్మి తెగిస్తూ ఉంటారు అధికారంలోని వారు. అయితే నేతలు అర్థం చేసుకోవాల్సింది ఇదంతా స్థానబలిమి కానీ, తమ బలిమి కాదు అని! అధికారం అనే స్థానంలో ఉండటం వల్ల.. తాము చెప్పింది జరుగుతోంది. రేపు స్థానం మారితే మళ్లీ పరిస్థితి మొదటకు వస్తుంది!నారా లోకేష్ బాబు రెడ్ బుక్ పాటను ఇంకా వదలడం లేదు. ఇలాంటి మాటలు అధికారం లేనప్పుడు మాట్లాడితే బాగుంటాయి కానీ, అధికారం సంపాదించుకున్నాకా తమ ఉద్దేశాలు ఎలా ఉన్నా, కనీసం మాటల్లో అయినా వీటి వేడి తగ్గాల్సింది. అయితే లోకేష్ మాత్రం రెడ్ బుక్ ను తలస్తూనే ఉన్నారు. ఈ రోజు ఇవన్నీ బావుంటాయి. రేపు పరిస్థితి తిరగబడితే.. ఈమాటలే ప్రత్యర్థులకు అస్త్రాలు అవుతాయి. అధికారంలో ఉన్నప్పుడు రోజూ రెడ్ బుక్ అన్నారు కదా.. అని ప్రత్యర్థులు తమ దాడులను సమర్థించుకుంటారు. ఇంకా బోలెడంత రాజకీయ భవితవ్యం ఉన్న లోకేష్ ఎందుకు రెడ్ బుక్ ను ఇంత హైలెట్ చేసుకుంటూ ఉన్నారో బోధపడదు. బహుశా అధికారం తమకే శాశ్వతం అనే భావనలో ఆయన కూడా ఉండొచ్చు.ఇక ఇవే పార్టీలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాత్రం ప్రజాస్వామ్యిక విలువల గురించి మాట్లాడతాయి. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు లోకేష్ ఏమనే వారో అందరికీ గుర్తే ఉంటుంది. రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగం అమలవుతోందంటూ తరచూ లోకేష్ వ్యాక్యానించేవారు. మరి ఇప్పుడు ఆయనే రెడ్ బుక్ అంటారు. అధికారం లేకపోతే.. రాజారెడ్డి రాజ్యాంగం, అధికారం దక్కితే రెడ్ బుక్ అనడమా! ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజాస్వామ్యిక విలువలే పరమావధి, అప్పుడు గాంధీ విగ్రహం .. అధికారం దక్కితే బాహాటంగా అయినా రెడ్ బుక్ అనొచ్చనమాట!గమనించాల్సిన విషయం ఏమిటంటే.. రెడ్ బుక్ అన్నా, రాజారెడ్డి రాజ్యాంగం అమలైనా.. పెద్ద నేతలకు మాత్రం పెద్ద ఇబ్బంది ఉండదు. మహా అంటే నెలా రెన్నెల్లో జైలు జీవితాలను చూస్తారు. ఆ తర్వాత ఎలాగూ బెయిల్ దక్కుతుంది.. మళ్లీ పాతకథే. అయితే వీటిని నమ్ముకున్న సామాన్యులు మాత్రం గుల్ల అయిపోయే పరిస్థితులు వచ్చాయి. తమ పార్టీ అధికారంలోకి వస్తే తాము ఏదో చేసేసుకోవచ్చు అనే లెక్కలేసి వీటిని గుడ్డిగా సమర్థించేసే వాళ్లు బోలెడంతమంది తయారయ్యారు గ్రామాల్లో కూడా. అయితే వీరినీ అంతిమంగా పార్టీలు సంతృప్తి పరచలేవు.వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ హయాంలో వలంటీర్లు, సచివాలయాలు వచ్చి.. ఆ పార్టీ క్యాడర్ ను తీవ్ర నిస్పృహకు గురి చేశాయి. దీంతో ఎన్నికల నాటికి క్యాడర్ అడ్రస్ లేకుండా పోయింది. తెలుగుదేశం పార్టీ అధికారంలో వచ్చాకా కార్యకర్తలు చెప్పిందే రాజ్యం అయినా.. పోటీ ఎక్కువయిపోయింది. రెండొందల ఓట్లు ఉన్న ఊర్లో కూడా ముగ్గురు నలుగురు కార్యకర్తలు తయారయిపోయ చాలా కాలం అయ్యింది. తాము చెప్పిందే జరగాలనే పోటీ వీరిలో వీరికే ఎక్కువైంది. సంపాదించుకోవడంలో పోటీలు పెరిగిపోయాయి. ఈ పరిస్థితి ఒకరి వెనుక మరొకరు గోతులు తీసుకునే వరకూ వెళ్లడానికి మరెంతో సమయం పట్టేలా లేదు. వాళ్లు సంపాదించుకున్నారు, వాళ్లే సంపాదించుకుంటున్నారు, తాము తక్కువయిపోయామనే లెక్కలు.. ఇందుకు సంబంధించిన బొక్కలు ఎన్నికలనాటి ఎక్కడి వరకూ వెళతాయనేది ఆసక్తిదాయకంగా మారింది.అధికారం శాశ్వాతమని, తమకు తిరుగులేదని, తమ ప్రత్యర్థులను చావుదెబ్బ కొట్టేశామని, పొత్తులు, వ్యూహాలకు తిరుగులేదని, ప్రజలకు సంక్షేమ పథకాల రూపంలో కావాల్సింది పడేశామని, నేతలు భావిస్తారు. తాము ఇక రాజకీయం చేసుకుంటూ చాలు, ప్రజలేం పట్టించుకోరు అనుకుంటూ ఉంటారు! అయితే ప్రజలు అన్నీ గమనిస్తూ ఉంటారు! ఇది మాత్రం నేతలు ఎప్పటికీ అర్థం చేసుకోరు. ప్రత్యేకించి అధికారంలో ఉన్నప్పుడు వారు ఎన్నిచెప్పినా.. వారు లెక్క చేయనిది మాత్రం ప్రజలనే!

# స్కూల్ డేస్‌లో నేనూ అల్లరి పిల్లనే

న్యూఢిల్లీ,స్కూల్లో చదువుకునేటప్పుడు తానూ అల్లరి పిల్లనే అని అంటున్నారు బాలీవుడ్ నటి దీపికా పదుకొణె. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఏటా నిర్వహించే 'పరీక్షా పే చర్చ 'ను ఈసారి కాస్త వినూత్నంగా నిర్వహించారు. ఇందులోభాగంగా నటి దీపిక పాల్గొని.. మానసిక ఆరోగ్యంపై విద్యార్థులకు సలహాలిచ్చారు. ఇందుకు సంబంధించిన వీడియోను తాజాగా ఆమె తన ఇన్‌స్టా ఖాతాలో పంచుకున్నారు.'చిన్నప్పుడు స్కూల్లో నేనూ సోఫాలు, టేబుల్స్, కుర్చీలు ఎక్కి అల్లరి చేసేదాన్ని. చదువుకునే రోజుల్లో చాలా ఒత్తిడి ఉంటుంది. ఉదాహరణకు నాకు లెక్కలంటే చాలా భయం. ఇప్పటికీ అందులో నేను వీక్‌గానే ఉంటా. అయితే, ఆ భయాన్ని అధిగమించాలి. ప్రధాని మోదీ రాసిన 'ఎగ్జామ్ వారియర్స్' పుస్తకంలో వివరించినట్లుగా.. సమస్యను లోలోపల అణచిపెట్టుకోకుండా.. బయటకు చెప్పాలి. మీ తల్లిదండ్రులు, స్నేహితులు, కుటుంబసభ్యులు, టీచర్లతో పంచుకోవాలి. జర్నల్ లేదా డైరీ రాయడం అలవాటు చేసుకోవాలి. మిమ్మల్ని మీరు వ్యక్తపర్చుకోవడం కోసం అది గొప్ప మార్గం' అని దీపిక వివరించారు. తాను కూడా ఒక దశలో కుంగుబాటు సమస్యను ఎదుర్కొన్నట్లు నటి ఈసందర్భంగా తెలిపారు. దీపిక ఎపిసోడ్‌కు సంబంధించి తాజాగా ట్రైలర్ మాత్రమే పంచుకున్నారు. పూర్తి వీడియోను ఫిబ్రవరి 12న ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నారు. ఈసందర్భంగా ప్రధాని మోదీకి దీపిక కృతజ్ఞతలు తెలియజేశారు. మానసిక ఆరోగ్యంపై అవగాహన చాలా ముఖ్యమని అభిప్రాయపడ్డారు.కాగా.. 'పరీక్షా పే చర్చ'లో భాగంగా సోమవారం దిల్లీలోని సుందరవనంలో ప్రధాని మోదీ (ఖఓ ఓనీటతి) విద్యార్థులతో ముచ్చటించారు. పరీక్షలే జీవితంలో సర్వస్వంగా చూడకూడదని, తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఇతరులతో పోల్చడం మానుకోవాలని, బయటివారికి చూపించడానికి మోడల్స్‌గా వారిని ఉపయోగించుకోకూడదని సూచించారు. ఇక ఈ ఏడాది 'పరీక్షా పే చర్చ'లో దీపికా పదుకొణెతో పాటు బాక్సర్ మేరీ కోమ్, ఆధ్యాత్మిక గురువు సద్గురు జగ్గీ వాసుదేవ్, యూట్యూబర్-టెక్నికల్ గురు రాధికాగుప్తా వంటి వివిధ రంగాల ప్రముఖులు కూడా పాల్గొని విద్యార్థులతో తమ అనుభవాలను, పరిజ్ఞానాన్ని పంచుకున్నారు. అందుకు సంబంధించిన పాడ్‌కాస్ట్ ఎపిసోడ్స్‌ను త్వరలోనే విడుదల చేయనున్నారు.

# రక్షణరంగంలో స్వావలంబనతో పాటు..ఎగుమతులు

బెంగళూరు,కేంద్ర ప్రభుత్వం పిలుపునిచ్చిన ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా రక్షణరంగ ఉత్పత్తుల్లో భారత్ దూసుకుపోతోంది. మన దేశంలో కొత్త పరికరాల తయారీయే కాకుండా ప్రపంచం కోసం తయారుచేయాలనే పిలుపును అందిపుచ్చుకున్న రక్షణరంగం- అత్యాధునిక సామర్థ్యాలతో భావి సవాళ్లను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉంది. కర్ణాటకలో యలహంకలోని వైమానిక కేంద్రంలో జరుగుతోన్న 15వ ఏరో ఇండియా ప్రదర్శన వీటన్నింటికీ వేదికగా నిలిచింది. 2047 వైపు పురోగమిస్తోన్న భారత్.. వైమానిక రంగంలో స్వావలంబన, సాంకేతికంగా అధునాతన శక్తిగా ఆవిర్భవించేందుకు కట్టుబడి ఉంది. ఇంటిలిజెన్స్, నిఘా, లాజిస్టిక్స్‌లో మన సామర్థ్యాలను మెరుగుపరుచుకోవడంతో మిలిటరీ ఆపరేషన్‌లలో కీలకపాత్ర పోషించడానికి వీలు కలగనుంది. అలాగే తర్వాత తరం యుద్ధ హెలికాప్టర్లు, ఏఐ ఆధారిత డ్రోన్లను అభివృద్ధి చేయడం వల్ల మన సామర్థ్యం మరింత మెరుగుపడనుంది. ఆర్మీ ఏవియేషన్ కార్ప్స్ నారీశక్తికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. పలు కీలక పోస్టుల్లోకి మహిళా అధికారులను తీసుకుంటోంది. దీంతో స్త్రీ, పురుషులు అనే తేడా లేకుండా మిలిటరీ ఆపరేషన్లలో నారీమణులు కీలకంగా వ్యవహరించేందుకు దోహదం చేయనుంది. ఆ దిశగా 2022లో మిలిటరీ పైలట్లుగా చేరిన వారిలో మేజర్ అభిలాషా బారక్.. ప్రతిష్ఠాత్మక సిల్వర్ చీతా ట్రోఫీని దక్కించుకున్నారు. కంబాట్ ఆర్మీ ఏవియేషన్ ట్రైనింగ్ స్కూల్‌లో శిక్షణలో భాగంగా అద్భుతమైన ప్రతిభ చూపినవారికి దీనిని అందిస్తారు. ప్రస్తుతం ఆర్మీ ఏవియేషన్ కార్ప్స్‌లో 13 మంది మహిళలు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్నారు. రిమోట్లీ పైలటెడ్ ఎయిర్‌క్రాఫ్ట్ సిస్టమ్స్ ఆపరేషన్లలో 8 మంది, వివిధ ఆర్మీ ఏవియేషన్ స్క్వాడ్రన్‌లలో 9 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. అలాగే యుద్ధరంగంలోనూ వారిని మోహరిస్తున్నారు. వారి సామర్థ్యాన్ని గుర్తించిన భారత సైన్యం.. మహిళా అధికారులకు సాధికారత కల్పించడానికి కట్టుబడి ఉంది.

# నష్టం చేస్తున్నాయా ?

హైదరాబాద్,బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి అయిన కేటీఆర్ ప్రతీ విషయం మీద ట్వీట్లు పెడుతూంటారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆ విధంగా ఎండగడుతూంటారు. ఎక్కడ ఏ సంఘటన జరిగినా ప్రభుత్వానికి సంబంధం చూపుతూ ఆయన ట్వీట్లు వేస్తారు. దీని వల్ల జనంలో చర్చ సాగాలని సర్కార్ బదనాం కావాలన్న ఎత్తుగడలతోనే ఇదంతా చేస్తున్నారు.రాజకీయాల్లో ఇది ఒక విధానంగా ఉన్నా కేటీఆర్ ఉన్న పార్టీ బీఆర్ఎస్ పదేళ్ళ పాటు తెలంగాణాను ఏలిన పార్టీ. కేటీఆర్ కూడా మంత్రిగా పదేళ్ళ పాటు పనిచేశారు. మరి సమస్యలు ఎపుడూ ఉంటూనే ఉంటాయి. ఒక సమస్యను విపక్షంగా వీరు చెబితే మీ హయాంలో పది సమస్యలు చెప్పమంటారా అని అధికార కాంగ్రెస్ నేతలు రివర్స్ లో ఎటాక్ చేస్తూంటారు. అది వారి రాజకీయ వ్యూహం.దీంతో ఒక ఇష్యూతో కాంగ్రెస్ ని కార్నర్ చేయబోయి మరిన్ని ఇష్యూస్ తో కేటీఆర్ చిక్కుకుంటున్నారా అన్న చర్చ అయితే వస్తోంది. ఇవే కాదు రాజకీయంగా కూడా కేటీఅర్ వేసే ట్వీట్లు కూడా ఎదురు తంతున్నాయని బీఆర్ఎస్ ని బూమరాంగ్ చేస్తున్నాయని అంటున్నారు. ఉదాహరణకు చూస్తే కనుక ఢిల్లీలో కాంగ్రెస్ ఓటమి పాలు అయింది. రాహుల్ గాంధీ మీద కేటీఆర్ ఈ సందర్భంగా పెట్టిన ట్వీట్ అయితే అభాసుపాలు అయింది అని అంటున్నారు.కాంగ్రెస్ బీజేపీని గెలిపించింది అన్నట్లుగా ట్వీట్ పెట్టి కంగ్రాట్స్ అంటూ రాహుల్ కి చెప్పడం మీద బీఆర్ఎస్ నే అంతా టార్గెట్ చేశారు. నిజానికి కాంగ్రెస్ బీజేపీల మధ్య జాతీయ స్థాయిలో ఎంతటి రాజకీయ వైరం ఉంటుందో అందరికీ తెలుసు. అలాంటిది ఈ ట్వీట్ల ద్వారా కేటీఆర్ కాంగ్రెస్ బీజేపీ ఒక్కటి అని చెప్పాలనుకోవడం రాజకీయ అతిగానే అంతా చూశారు. అందుకే అభాసు అయింది అని అంటున్నారు. దాంతో కేటీఆర్ ఈ రోజు మరో ట్వీట్ పెట్టి మరీ డిలిట్ చేశారు అని గుర్తు చేస్తున్నారు.ఇక చూస్తే కనుక తెలంగాణాలో బీజేపీ బీఆర్ఎస్ ఒకటి అని అంతా డిసైడ్ అయ్యారని అంటున్నారు. దానికి ఎన్నో నిదర్శనాలు ఉదంతాలు ఉన్నాయని చెబుతున్నారు. ఇప్పటిదాకా కేటీఆర్ కానీ బీఆర్ఎస్ నేతలు కానీ బీజేపీ మీద ఒక్క ట్వీట్ కూడా వేయలేదని గుర్తు చేస్తున్నారు.బడ్జెట్ సహా అనేక అంశాలలో తెలంగాణాను కేంద్ర ప్రభుత్వం బీజేపీ అన్యాయం చేసినా వాటి మీద ఒక్క ట్వీట్ కూడా ఎందుకు ఉండదని ప్రశ్నిస్తున్నారు. అదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం లో చీమ చిటుక్కుమన్నా కూడా కేటీఆర్ ట్విట్టర్ హ్యాండిల్ బిగ్ సౌండ్ చేస్తుందని అంటున్నారు.ఈ విధంగా గులాబీ పార్టీ కమలం పార్టీల మధ్య తెర వెనక తెలియని బంధం ఉందా అన్న చర్చ కూడా సాగుతోంది.

# బడ్జెట్ కసరత్తులో ఆర్థికమంత్రి కేశవ్ బిజీ



అమరావతి,కొత్తగా ఎపిలో ఏర్పడ్డ కూటమి ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ ప్రవేశ పెట్టేందుకు సిద్ధం అవుతోంది. ఆర్థికమంత్రిగా పయ్యావుల కేశవ్‌కు ఇది తొలి సవాల్ కానుంది. గతంలో మంత్రిగా పనిచేసిన అనుభవం లేకున్నా..రాజకీయంగా సుదీర్ఘకాలం ఉన్న అనుభవం ఉంది. అప్పులకుప్పగా ఉన్న ఎపిని గట్టెక్కించడంతో పాటు, అనేక రంగాలను గాడిలో పెడుతున్న తరుణంలో బడ్జెట్ రూపకల్పనపై కసరత్తు ముమ్మరంగా జరుగుతోంది. వివిధ శాఖలకు చెందిన మంత్రులు, ఆయా శాఖల ఉన్నతాధికారులతో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. చంద్రబాబు నాయకత్వంలో ప్రభుత్వంకనుక ఆయన తన విశేష అనుభవంతో సూచనలు సలహాలు ఇస్తున్నారు. ప్రధానంగా అభివృద్ధి పక్కకు పోకుండా, సంక్షేమం జారిపోకుండా కత్తిమీద సాములా ఇప్పుడు మంత్రి కేశవ్ కసరత్తు చేస్తున్నారు. ఆయా శాఖల కార్యదర్శులతో మంత్రి పయ్యావుల ప్రీ-బ్జడెటరీ సమావేశాలు నిర్వహిస్తున్నారు. తమ శాఖలకు కావాల్సిన నిధులను.. ప్రవేశపెట్టేబోయే పథకాలను సమిక్షల్లో మంత్రి పయ్యావులకు ఆయా శాఖల మంత్రులు వివరించారు. పెండింగ్ ప్రాజెక్టులకు నిధులను కేటాయించాల్సిందిగా ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు.. పయ్యావులను కోరారు. ప్రాధాన్యతల వారీగా ప్రాజెక్టులకు నిధుల విడుదల చేసే దిశగా ఆలోచన చేస్తున్నారు. ఏయే ప్రాజెక్టులకు నిధులు విడుదల చేయాలోననే అంశంపై ఓ స్పష్టమైన అవగాహనతో ప్రభుత్వం ఉంది. నీటి ప్రాజెక్టులకు రూ.32 వేల కోట్లు కేటాయించాలని జల వనరుల శాఖ ప్రతిపాదించగా.. అంత పెద్దమొత్తంలో కేటాయింపులు అసాధ్యమని.. ఈ ఏడాదికి రూ.21 వేల కోట్లతో సర్దుకోవాలని నిమ్మలకు పయ్యావుల సూచించారు. ఇందులో పోలవరం ప్రాజెక్టుకు రూ.9,000 కోట్లు, గాలేరు-నగరి, హంద్రీ-నీవాకు చెరో రూ.4,500 కోట్లు, వెలిగొండకు రూ.1,800 కోట్లు ఇస్తామన్నారు. అయితే ఈ కేటాయింపులతో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, ఇతర చిన్న, మధ్యతరహా నీటిపారుదల ప్రాజెక్టులను ఎలా చేపడతామని నిమ్మల ప్రశ్నించారు. చాలా ప్రాజెక్టుల పనులు ముందుకు సాగవన్నారు. ప్రాజెక్టుల యాజమాన్య నిర్వహణకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఆర్థిక మంత్రిని కోరారు.గతంలో ఏయే రంగాలను విస్మరించారు, ఎక్కడెక్కడ దుబారా చేశారన్నది గమనించి ముందుకు సాగేలా చర్చలు చేస్తున్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణం, నిర్వహణ బడ్జెట్‌లో అతిపెద్ద సవాల్‌గా ఉండనుంది. అలాగే వివిధ సంక్షేమ శాఖల్లో అమలు చేయాల్సిన పథకాలు వాటికి అవసరమైన డ్జెట్ కేటాయింపులు చూసుకోవాలి. ఆయా శాఖల మంత్రులు సవిత, డోలా బాల వీరాంజనేయ స్వామి, గుమ్మడి సంధ్యారాణి, ఎన్ఎండీ ఫరూక్ ఇప్పటికే ప్రతిపాదనలు ఇచ్చారు. కాగా మైనింగ్ శాఖకు అవసరమైన నిధులను కేటాయించాలని ఆ శాఖ ఉన్నతాధికారులు మంత్రి పయ్యావులను కోరారు. మైనింగ్ శాఖ నుంచి ఆదాయాన్ని కూడా అదే స్థాయిలో తీసుకురావాలని అధికారులకు మంత్రి సూచించారు. గనుల శాఖ నుంచి వీలైనంత నిధులు వచ్చేలా చూడాలని సీఎం చంద్రబాబు ఇప్పటికే ఆదేశించారు. ప్రాధాన్యతల వారీగా బ్జడెట్ ప్రతిపాదనలు పెట్టాలని మంత్రి కసరత్తు చేస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని బడ్జెట్ ప్రతిపాదనలు పెట్టాల్సి ఉంటుంది.

# వేడెక్కిన స్థానిక సమరం.. దానిపై కారు-కమలం మల్లగుల్లాలు



హైదరాబాద్, తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల వేడి మొదలైందా? రేవంత్ సర్కార్ నిర్ణయంతో విపక్షాలు మల్లగుల్లాలు పడుతున్నాయా? సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ వేదికగా చేసిన ప్రకటనతో ఎలా చెయ్యాలనే ఆలోచనలో మిగతా పార్టీలు పడ్డాయా? బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఎలా అన్న ప్రశ్న బీఆర్ఎస్, బీజేపీలను వెంటాడుతోందా? తాము సిద్ధమేనని బీఆర్ఎస్ పైకి చెబుతోందా? దీనిపై ఇంకా నిర్ణయం వెల్లడించకుండా బీజేపీ ఎందుకు తాత్సారం చేస్తోంది?రేపో మాపో తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ మొదలుకానుంది. దీనికి సంబంధించి ఒకొక్కటి క్లియర్ చేస్తూ వస్తోంది రేవంత్ సర్కార్. ఇందులో భాగంగా బుధవారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో బీసీ డెడికేటెడ్ కమిషన్ రిపోర్టుపై ఉన్నతాధికారులతో చర్చించనున్నారు సీఎం రేవంత్ రెడ్డి. పంచాయితీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు, ఎన్నికల ఏర్పాట్లపై చర్చించనున్నారు. దీని తర్వాత సర్పంచ్, ఎంపీటీపీ, జెడ్పీటీసీలు ఎన్ని విడతలుగా ఎన్నికలు నిర్వహించాలనే దానిపై ప్రభుత్వం ఓ అంచనాకు రానుంది. ఇక రాజకీయాల విషయానికొద్దాం. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాలనే పట్టుదలతో ఉన్నారు సీఎం రేవంత్‌రెడ్డి. కులగణన సర్వే అసెంబ్లీ చర్చ సందర్భంగా ఈ విషయాన్ని ప్రస్తావించారు. చట్టపరంగా బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వడం సాధ్యం కాకుంటే పార్టీ పరంగా ఎన్నికల్లో 42 శాతం అమలు చేస్తామని కుండబద్దలు కొట్టేశారు. బీసీ డెడికేటెడ్ కమిషన్ సిఫార్సుల ప్రకారం స్థానిక సంస్థల్లో బీసీలకు 22 నుంచి 23 శాతం రిజర్వేషన్లు చట్టబద్దంగా వస్తాయి. మిగతా 20శాతం సీట్లను పార్టీ పరంగా కేటాయించాలనే నిర్ణయానికి ముఖ్యమంత్రి ఉన్నట్లు అధికార పార్టీల్లో చర్చ జరుగుతోంది. అధికార పార్టీ ఈ విధంగా చేస్తే.. మిగతా పార్టీలు కాంగ్రెస్ దారిలో నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. డెడికేటెడ్ సిపార్సుల ప్రకారం ఎంపీటీసీ, జెడ్పీటీసీ సీట్లకు 22 శాతం రిజర్వేషన్లు అధికారంగా అమలు చేస్తూనే మిగతా 20శాతం బీసీలకు టికెట్లు ఇవ్వాలని భావిస్తోంది. ఎంపీపీలు, జెడ్పీ ఛైర్మన్ ఎంపికలో దామాషా పాటించాలని నిర్ణయానికి వచ్చినట్టు పార్టీ వర్గాల మాట. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 42 శాతం కేటాయిస్తే.. మిగతా పార్టీలపై ఒత్తిడి పెరగడం ఖాయం. దీనిపై ఇటు బీఆర్ఎస్, బీజేపీలో తేల్చుకోలేక పోతున్నాయి. ఇటీవల ఆయా పార్టీ సమావేశాల్లో దీనిపై చర్చ జరిగినట్టు తెలుస్తోంది. బీజేపీతోపాటు బీఆర్ఎస్ కూడా దీనిపై మల్లగుల్లాలు పడుతోంది. దీనిపై గతంలో కేటీఆర్ ఓ మాట ప్రస్తావించారు. కాంగ్రెస్ పార్టీ మాదిరిగా తాము కూడా 42 శాతం కేటాయిస్తామని చెప్పేశారు. కానీ.. పార్టీలో పరిస్థితులు ఆ స్థాయిలో లేవని అంటున్నారు. అధికారం పోయిన తర్వాత కేడర్ చెల్లాచెదురైంది. కేడర్ బలహీనం కావడంతో క్షేత్రస్థాయిలోకి వెళ్ల లేని పరిస్థితి కారు పార్టీ నేతలది. ఇక బీజేపీ విషయానికొద్దాం. బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై సైలెంట్ అయిపోయింది. సిటీ, పట్టణాల్లో ఆ పార్టీ కొంత కేడర్ ఉంది. రూరల్లో మరింత వీక్‌గా కనిపిస్తోంది. ఇటీవల భర్తీ చేసిన పార్టీ మండల అధ్యక్ష పదవులు బీసీలకు 50 శాతం కేటాయించామని బయటకు చెబుతోంది. స్థానిక సంస్థల ఎన్నికలపై ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు. ఈ విషయంలో ఏ విధంగా ముందుకు వెళ్లాలో తెలియని సందిగ్ధంలో ఆ పార్టీ పడినట్టు తెలుస్తోంది. తెలంగాణలో 42 శాతం అమలు చేస్తే.. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇదే నినాదం రావచ్చని అంటున్నారు. మరి బీసీలకు 42 శాతం అంశం బీజేపీ ఎలా హ్యాండిల్ చేస్తుందో చూడాలి.

# ఇద్దరికి ఇద్దరు.. రూల్స్ కర్రతో స్పీకర్ జోడి విజృంభణ

సెంట్రల్ డెస్క్:ఒకటే మాట.. ఒకటే బాటలా సాగుతోంది ఏపీలో శాసన సభాపతి, ఉప సభాపతి జోడి. ప్రతిపక్ష వైసీపీ, ఆ పార్టీ నేత మాజీ సీఎం జగన్ టార్గెట్‌గా ఈ ఇద్దరూ పొలిటికల్ పంచులు వేస్తున్నారు. వేటు కత్తి పట్టుకుని సిద్ధంగా ఉన్నామంటున్నారు. అయితే వీరి బెదిరింపులు, అదిరింపులకు వైసీపీ భయపడుతుందా? లేక ఏం చేస్తారో చూస్తామంటూ మరింత మంట పుట్టిస్తుందా? అనేది ఆసక్తికరంగా మారింది.


గతంలో ఏ స్పీకర్ జోడి కూడా వీరిలా ఇంత చక్కటి సమన్వయంతో పనిచేయకపోవడం, ఇద్దరూ ఒకటే టార్గెట్ తో రాజకీయ వ్యూహాన్ని అమలు చేస్తుండటం పొలిటికల్ సర్కిల్స్ లో చర్చకు దారితీస్తోంది. 60 రోజులు సభకు రాకపోతే అనర్హత వేటు వేస్తామని, పులివెందుల ఉప ఎన్నిక వస్తుందని డిప్యూటీ స్పీకర్ రఘురామ ఎప్పటి నుంచో చెబుతున్నారు. అయితే ఆయన లేవనెత్తిన అంశంపై ఇంతవరకు అధికార పక్షం పెద్దగా పట్టించుకోలేదు. చట్టం తన పని తాను చేసుకుపోతుంది అన్నట్లే వ్యవహరిస్తోంది. సభకు రావడం లేదన్న కారణంతో వేటు వేయడం అంటే చిన్నవిషయం కాదు. అదీ ఓ మాజీ ముఖ్యమంత్రిపై అనర్హత వేటు వేస్తే అదో రాజకీయ సంచలనమే అవుతోంది. అందుకే దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యూహాత్మక మౌనం పాటిస్తున్నారు. కానీ, ఉప సభాపతి వ్యాఖ్యలకు మద్దతుగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు కూడా శ్రుతి కలుపుతుండటమే రాజకీయంగా హీట్ పుట్టిస్తోంది. వాస్తవానికి వైసీపీని ఇలాంటి రాజకీయ సమస్యలో ఇరికించే ఉద్దేశంతోనే కూటమి స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎంపికపై ఆచితూచి నిర్ణయం తీసుకుందని అంటున్నారు. ఇప్పుడు ఈ ఇద్దరి తీరు చూస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు సరైన నిర్ణయమే తీసుకున్నారని కూటమి కార్యకర్తలు సంబరపడుతున్నారు. గతంలో స్పీకర్, డిప్యూటీ స్పీకర్ పదవులకు ఇప్పుడున్నంత క్రేజ్ లేదు. ప్రస్తుతం ఆ పదవిలో ఉన్న ఇద్దరూ గత ప్రభుత్వంలో తీవ్ర నిర్బంధాన్ని ఎదుర్కోవడంతో వారు ఇప్పుడు రివేంజ్ పాలిటిక్స్ ప్రదర్శిస్తుండటమే రాజకీయంగా ఆసక్తి పుట్టిస్తోంది. గత ప్రభుత్వంలో అప్పటి



సీఎం జగన్ పై ప్రతిరోజూ రచ్చబండ పేరిట రచ్చ చేసిన రఘురామ ఇప్పుడు కూడా నిన్ను వదలను జగన్ అంటూ వెంటపడుతున్నారు. అదేవిధంగా గతంలో తనపై నమోదైన కేసులను ఎదురొడ్డి ఎన్నికల్లో గెలిచిన అయ్యన్న కూడా తనదైన అధికారంతో వైసీపీని ఇరకాటంలోకి నెట్టేస్తున్నారు. ఈ ఇద్దరితో సయోధ్య చేసుకుని మెలిగితే వైసీపీకి సభలో కొంతమేర ప్రయోజనం దక్కే వీలుంటదని అంటున్నారు. కానీ, మాజీ సీఎంకు సభాపతులు ఇద్దరితోనూ పేచీ ఉండటమే వైసీపీని మరింత ఇబ్బంది పెడుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో సభాపతులు ఇద్దరు రూల్స్ కర్ర పట్టుకుని ప్రతిపక్షాన్ని వెంబడించడం రాజకీయంగా ఉత్కంఠ రేపుతోంది. ఈ ఇద్దరూ ఎవరి మాట వినే రకం కాదని, నిజంగా 60 రోజుల గైర్హాజరుకు అనర్హత వేటు వేసే అవకాశం ఉంటే వారి యాక్షన్ ఎలా ఉంటుందనేది ఉత్కంఠ రేపుతోంది. నిజంగా రూల్స్ అలా ఉంటే ఈ ఇద్దరూ ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలను కూడా పాటించే రకాలు కాదంటున్నారు. దీంతో వీరి రాజకీయ కక్ష ఏమైనా ఉంటే.. ప్రభుత్వం జోక్యం లేకుండానే ఉప ఎన్నికలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని విశ్లేషిస్తున్నారు.

# చిలుకూరు అర్చకుడు రంగరాజన్ పై దాడి రాజకీయమయ్యిందా?

హైదరాబాద్,చిలుకూరు బాలాజీ ప్రధాన అర్చకుడు రంగరాజన్ పై దాడి ఘటన తెలంగాణలో పొలిటికల్ టర్న్ తీసుకుంది. రామరాజ్యం పేరిట వీరరాఘవరెడ్డి రంగరాజన్ నివాసానికి వెళ్లి దాడి చేయడాన్ని ప్రతిపక్షాలు సీరియస్‌గా తీసుకున్నాయి. ప్రధాన ప్రతిపక్షమైన బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటీఆర్ ఇప్పటికే రంగరాజన్ నివాసానికి వచ్చి పరామర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టార్గెట్ గా ఆయన విమర్శలు చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ ఫోన్ లోనే రంగరాజన్ ను పరామర్శించారు. అవసరమైతే కేంద్ర బలగాలను రక్షణగా అందిస్తామని హామీ ఇచ్చారు. ఘటనపట్ల తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. సనాతన ధర్మంపై జరిగిన దాడిగా ఆయన అభివర్ణించారు. రంగరాజన్ పై దాడి వ్యక్తిగతంగా చూడకూడదని హిందుత్వంపై జరిగిన దాడిగా చూడాలని ఆర్ఎస్ఎస్ తో బాటు మిగతా హిందుత్వ సంఘాలు అభివర్ణించాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రంగరాజన్ కు ఫోన్ లోనే పరామర్శించారు. . పోలీసులు తగు చర్యలు తీసుకోగలరని ముఖ్యమంత్రి హామి ఇచ్చారు. దేవాదాయ శాఖా మంత్రి కొండా సురేఖ ఘటన తర్వాత రంగరాజన్ నివాసానికి చేరుకుని పరామర్శించారు. ఎపి డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ రంగరాజన్ పై దాడి హిందుత్వంపై జరిగిన దాడిగా అభివర్ణించారు. ఆయన యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు రంగరాజన్ పై దాడికి గల కారణాలను పోలీసులు లోతుగా అధ్యయనం చేస్తున్నారు. రామరాజ్యం పేరిట వీర రాఘవరెడ్డి ప్రయివేటు సైన్యాన్ని పెంచి పోషిస్తున్నట్లు తెలిసింది. ఇటీవల కొందరు యువకులను రామరాజ్యం ఆర్మీలో రిక్రూట్ చేసుకున్నాడు. నెలకు 20 వేల రూపాయల జీతం ఇస్తానని ఆశచూపి పెద్ద ఎత్తున యువకులను రిక్రూట్ చేసుకున్నాడు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న దేవాలయాలకు వెళ్లి విరాళాలు సేకరించడం అతడి టార్గెట్ . ఇందులో భాగంగానే ఈ నెల 7న చిలుకూరు బాలాజీ దేవాలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్ ఇంట్లో ఎంటర్ అయ్యాడు . విరాళాలు అడిగాడు. చిలుకూరు బాలాజీ దేవాలయంలో హుండీ లేకపోవడం తగదని వీర రాఘవరెడ్డి వర్గీయులు వారించారు. బూట్లతో రంగరాజన్ నివాసంలో ప్రవేశించడమే గాకుండా దేవాలయాన్ని తమకు అప్పగించేయాలని డిమాండ్ చేశారు. రామరాజ్యం రావాలంటే దేవాలయంలో హుండీ ఏర్పాటు చేయాల్సిందేనని బెదిరించారు. ఆయన తనకు తాను రాముడి అంశ అని చెప్పుకునేవాడు. రంగరాజన్ పై దాడి చేసిన రామరాజ్యం ప్రయివేటు సైన్యంలోని ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేసి జ్యుడిషియల్ రిమాండ్ కు పంపారు. వీరిలో కర్త, కర్మ, క్రియ అయిన వీర రాఘవరెడ్డి కూడా ఉన్నారు. రామరాజ్యం పేరిట సంఘ విద్రోహకార్యకలాలు ఏమైనా జరిగాయా అన్న కోణంలో పోలీసులు కూపీ



లాగుతున్నారు. ఉస్మానియా యూనివర్శిటీ మాజీ రిజిస్టార్ ప్రొఫెసర్ సౌందర్యరాజన్ పూర్వికులు ఈ దేవాలయానికి వంశపారపర్యంగా అర్చకులుగా కొనసాగుతున్నారు. ఆయన కుమారుడే రంగరాజన్ ఈ దేవాలయ ప్రధాన అర్చకులుగా కొనసాగుతున్నారు. 1988 బయో మెడికల్ ఇంజినీరింగ్ పూర్తి చేశారు. ఆగమశాస్త్రాలు కూడా ఆయన చదువుకున్నారు. చిలుకూరి బాలాజీ దేవాలయం రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ లో ఉంది. దీనిని విసా బాలాజీ అనేమరో పేరు ఉంది. విదేశాలకు వెళ్లాలనుకునే వాళ్లు ఇక్కడికి వస్తుంటారు. 1995లో అర్చక ప్రవేశం పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారు. చిలుకూరు బాలాజీ దేవాలయాన్ని దేవాదాయ శాఖలో కలపాలనే ప్రభుత్వ ప్రయత్నాలను రంగరాజన్ తండ్రి సౌందర్యరాజన్ గట్టిగానే అడ్డుకున్నారు.. సుప్రీంకోర్టు నుంచి మార్గదర్శకాలను తెచ్చుకున్నారు. రాష్ట్రంలోని ప్రయివేటు గుళ్ల యజమానుల తరపున పోరాడే వన్ మ్యాన్ ఆర్మీ సౌందర్య రాజన్ . మూడు భాషల్లో వెలువడే వాక్ అనే ఆధ్యాత్మిక పత్రికకు సంపాదకులుగా ఉన్నారు అర్చకవారసత్వాన్ని రద్దుచేయాలని ప్రభుత్వ నిర్ణయంపై సౌందర్య రాజన్ గట్టిగానే పోరాడారు. ఆయన కున్న ముగ్గురు కొడుకుల్లో రంగరాజన్ రెండో వాడు. దేవాదాయశాఖ అధికారి ఒకాయన మీకు ఉన్న ముగ్గురు కొడుకులు విద్యాధికులు. మీరు రిటైర్డ్ రిజిస్టార్. కొడుకులు అర్చకవృత్తికి దూరంగా ఉన్నారు. అర్చక వారసత్వం కోసం ఎందుకు? దేనికి పోరాడుతున్నారు అని ప్రశ్నిస్తే నేను అర్చకత్వం చేస్తానని రంగరాజన్ ముందుకొచ్చారు. అప్పటికే లక్షల రూపాయల జీతాన్ని వదిలేసి అర్చకత్వం స్వీకరించిన రంగరాజన్ పై జరిగిన దాడిని ఇపుడు రెండు తెలుగు రాష్ట్రాల్లో పలువురు ఖండిస్తున్నారు. . రంగరాజన్ కు బాసటగా నిలుస్తున్నారు.

# తమిళనాట దళపతి విజయ్ పాదయాత్ర.. ప్రశాంత్ కిషోర్ వ్యూహాలు



తమిళనాడు: తమిళనాడు రాజకీయాలలోకి ప్రముఖ హీరో తళపతి విజయ్ ప్రవేశమే ఒక సంచలనం అనుకుంటే.. ఆయన తన పార్టీ తమిళగ వెట్రిక కజగం (టీవీకే)కు ఎన్నికల వ్యూహకర్తగా ప్రశాంత్ కిశోర్ ను నియమించుకోవడం మరింత సంచలనం సృష్టించింది. దేశంలో పలు పార్టీలను విజయతీరాలకు చేర్చేలా వ్యూహరచన చేసిన ప్రశాంత్ కిశోర్ గత కొంత కాలంగా ఎన్నికల వ్యూహకర్త కొలువు మానేసి బీహార్ లో సొంత పార్టీ పెట్టుకుని పూర్తిగా ఆ రాష్ట్ర రాజకీయాలకు పరిమితమైపోయారు. ఇప్పుడు మళ్లీ ఆయన ఎన్నికల వ్యూహకర్త అవతారం ఎత్తారు. తమిళనాట కొత్తగా రాజకీయ ప్రవేశం చేసిన హీరో విజయ్ పార్టీ టీవీకేకి ప్రత్యేక సలహాదారుగా ఎన్నికల వ్యూహాలు రచించనున్నారు. ప్రశాంత్ కిశోర్ మామూలు వ్యక్తి కాదు. కేంద్రంలో బీజేపీ అధికార పగ్గాలు అందుకోవడంలో పీకే వ్యూహాలు ఉన్నాయి. అలాగే 2019 ఎన్నికలలో ఆంధ్రప్రదేశ్ లో జగన్ నాయకత్వంలోని వైసీపీ అధికారంలోకి రావడానికి ప్రశాంత్ కిషోర్ వ్యూహరచనే కారణమనడంలో సందేహం లేదు. ఇక 2021 ఎన్నికలలో తమిళనాడులో డీఎంకే విజయం సాధించి అధికారపగ్గాలు చేపట్టం వెనుకా ప్రశాంత్ కిషోర్ వ్యూహ రచన ఉంది. అంతెందుకు పశ్చిమ బెంగాల్ లో మమతా బెనర్జీ వరుసగా మూడో సారి అధికార పగ్గాలు చేపట్టడం వెనుక ఉన్నదీ ప్రశాంత్ కిషోర్ వ్యూహాలే. అటువంటి ప్రశాంత్ కిశోర్ ఇటీవల పార్టీలకు ఎన్నికల వ్యూహాల రూపకల్పనకు గుడ్ బై చెప్పేసి తన స్వరాష్ట్రం బీహార్ లో తన రాజకీయ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. బీహార్ లో అధికారమే లక్ష్యంగా క్షేత్ర స్థాయిలో పని చేసుకుంటున్నారు. సుదీర్ఘ పాదయాత్ర చేశారు. రాష్ట్ర సమస్యలపై ఆందోళనా కార్యక్రమాలలో పాల్గొంటున్నారు. ఇటీవలే రాష్ట్రంలో విద్యార్థుల ఆందోళనకు మద్దతుగా నిరవధిక నిరాహార దీక్ష కూడా చేశారు. ఇక తమిళనాట సినీ హీరోగా విపరీతమైన ప్రేక్షకాదరణ ఉన్న విజయ్ సినీమాలకు గుడ్ బై చెప్పి రాజకీయ రంగ ప్రవేశం చేశారు. టీవీకే పేర సొంత పార్టీ ఏర్పాటు చేసి పూర్తి స్థాయి రాజకీయాలలోకి దిగారు. ప్రస్తుతం చేతిలో ఉన్న ఒకే ఒక సినిమాను పూర్తి చేసి ఈ ఏడాది మలి భాగంలో పూర్తిస్థాయిలో రాజకీయాలకే పరిమితం కానున్నట్లు విజయ్ ఇప్పటికే ప్రకటించారు. అందుకు అనుగుణంగానే ఆయన అడుగులు వేస్తున్నారు. 2026లో జరగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలలో పోటీకి ఇప్పటి నుంచే ప్రయత్నాలూ ఏర్పాట్లూ చేసుకుంటున్నారు. అందులో బాగంగానే టీవీకే పార్టీకి ఎన్నికల వ్యూహకర్తగా ప్రశాంత్ కిశోర్ ను నియమించుకున్నారు. రాష్ట్రంలో టీవీకే బలోపేతం, ఎన్నికల వ్యూహాల రూపకల్పన, పార్టీ ఆశయాలు, సిద్ధాంతాలను ప్రజలలో విస్తృతంగా ప్రచారం చేయడం వంటి అంశాలలో విజయ్ కు ఆయన పార్టీ టీవీకేకు ప్రశాంత్ కిశోర్ తోడ్పాటు, సహకారం అందిస్తారు. ఈ మేరకు ఇప్పటికే ప్రశాంత్ కిశోర్ తో సంప్రదింపులు పూర్తయ్యాయని చెబుతున్నారు. ఇక అధికారిక ప్రకటనే తరువాయి అంటున్నారు. దళపతి రాజకీయ ప్రస్థానం ఘనంగా ఉండేలా ప్రశాంత్ కిశోర్ ఇప్పటికే వ్యూహాలను సిద్ధం చేసినట్లు చెబుతున్నారు. అందులో భాగంగా రానున్న రోజులలో విజయ్ రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర లేదా బస్సు యాత్ర చేపట్టేలా ప్రశాంత్ కిశోర్ ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే రూట్ మ్యాప్ సిద్ధమైందని అంటున్నారు.

# విజయసాయిరెడ్డి ప్లేస్‌లో పేర్ని నాని.. జగన్ కీలక నిర్ణయం

విజయవాడ:ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పార్టీకి సంబంధించి కార్యక్రమాలపైన ప్రధానంగా దృష్టిపెట్టినట్లు తెలుస్తోంది. ఓటమి తర్వాత గతంలో చేసిన తప్పులన్ని కూడా సరిచేసుకుంటూ వస్తున్నారు. ఇటీవల విజయవాడ నగర కార్పోరేటర్లతో భేటీ అయిన వైసీపీ అధినేత జగన్ కీలక వ్యాఖ్యలు చేశారు.. ఎంత పెద్ద కూటములు వచ్చినా.. ఏం చేసినా, మన బలం, ప్రజల మద్దతు మనకు ఉందని విశ్వాసం వ్యక్తం చేశారాయన. 151 స్థానాలతో అధికారంలోకి వచ్చిన పార్టీ తర్వాత 11 స్థానాలకు పరిమితమై ప్రతిపక్ష హోదా కూడా దక్కించుకోలేక పోయింది.

అయితే 40 శాతం ఓటింగ్ దక్కిందన్న ధీమా జగన్‌లో వ్యక్తమవుతుంది. కాగా వైసీపీ ఉత్తరాంధ్రలో ప్రక్షాళనకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే పార్టీ వివిధ జిల్లాలలో ఇంఛార్జిలను నియమించిన సంగతి తెలిసిందే. దీంతో రీజనల్ కో ఆర్డినేటర్లను కూడా నియమించింది. మొన్నటి వరకు ఉత్తరాంధ్ర ఇంఛార్జిగా, వైసీపీ రాజ్యసభ ఎంపీగా విజయసాయి రెడ్డిని నియమించారు. అయితే ఇటీవల ఆయన వైసీపీకి రాజీనామా చేసి, రాజకీయ సన్యాసం స్వీకరించారు. దీంతో ఉత్తరాంధ్ర కో ఆర్డినేటర్ పోస్ట్ ఖాళీగా ఉంది. ఈ పోస్టును ఎవరితో భర్తీ చేయాలన్న దానిపై వైసీపీలో జోరుగా చర్చ సాగుతోందట. సీనియర్ నేత మాజీ మంత్రి బొత్స సత్యనారాణకు ఈ పదవి ఇస్తారనుకున్నారు. ఇక ఉత్తరాంధ్రలో కీలకనేతగా. పార్టీ ఏదైనా.. విధేయుడిగా ఉంటారనే పేరుంది. ప్రత్యర్థుల ఎత్తులను.. చిత్తు చేయటంలో ఆయనకు ఆయనే సాటి. కానీ బొత్స ఇప్పటికే శాశనమండలిలో ప్రతిపక్ష నేతగాఉన్నారు. అలాగే గోదావరి జిల్లాల వైసీపీ కో ఆర్డినేటర్‌గా ఉన్నారు. కాబట్టి ప్రస్తుతం ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించడంకంటే.. వేరే వాళ్లకి ఇవ్వాలని వైసీపీ హైకమాండ్ నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. “ఈ తరుణంలో వైసీపీ మాజీ మంత్రి మచిలీపట్నం నాయకుడు పేర్ని నానీకి ఈ పదవి ఇస్తారని జోరుగా ప్రచారం సాగుతోంది.” వైసీపీలో ఆయనో ఫైర్ బ్రాండ్. ఫ్యాన్ పార్టీని విమర్శిస్తే చాలు.. వాళ్లూ.. వీళ్లూ తేడా లేకుండా విరుచుకుపడేవారు. గత ఎన్నికల్లో పార్టీ ఘోర ఓటమి తర్వాత.. పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అధికారంలో ఉండగా.. ఓ వెలుగువెలిగిన నేత.. సైలెంట్ అయ్యారు. ఇటీవల రేషన్ రైస్ స్కామ్‌లో కేసులో ఇరుకున్నారు. వాటితో ఆయన సతమతమవుతున్నారు. అయితే ఆయన మళ్లీ




లైన్‌లోకి వస్తారని టాక్ వినిపిస్తోంది. ఇటీవల వైసీపీ నాయకులు ఆయనతో మాట్లాడినట్లు సమాచారం. పేర్ని నానీ కో ఆర్డినేటర్‌గా చేస్తే ఉత్తరాంధ్రలో కొంత ఊపు వస్తుందని భావిస్తున్నారట. ఇక వైసీపీ అధికారంలో ఉన్నా.. లేకున్నా జగన్‌ని అంటిపెట్టుకుంటూ వస్తున్నారు. ముఖ్యంగా కాపు సామాజిక వర్గానికి చెందిన నేత కాబట్టి, ఉత్తరాంధ్రలో విజయసాయి రెడ్డి ప్లేస్‌ని ఆయన రీప్లేస్ చేస్తే మాత్రం.. ఖచ్చితంగా అక్కడ పార్టీకి సంబంధించిన అంశాలపైన, ప్రభుత్వంపై గట్టిగా గళమెత్తే ఒక వాయిస్‌గా ఉంటారని జగన్ భావించారట. ఈ నేపథ్యంలో విజయసాయిరెడ్డి స్థానాన్ని బర్తీ చేయాలని చూస్తున్నారట. అంతేకాదు బొత్స సత్యనారాయణకు కూడా ఈ నియామకం ఆమోదయోగ్యంగా ఉంటుందని చెబుతున్నారు. కాగా 2016 నుంచి 2022 వరకూ విజయసాయిరెడ్డి రీజనల్ కో–ఆర్డినేటర్‌గా ఉన్నారు. ఆ తర్వాత 2024లో వైవీ సుబ్బారెడ్డి చేశారు. మళ్లీ విజయసాయి రెడ్డికే ఇచ్చారు కానీ.. ఆయన ఇటీవల రాజకీయాలకు గుడ్ బై చెప్పారు. అయితే ప్రతిసారీ వేరే సామాజిక వర్గానికి ఇస్తున్నారు కాబట్టి ఇప్పుడు స్థానికంగా ఉన్నవారికి ఇస్తే బాగుంటుందని పార్టీ నేతలు భావిస్తున్నారట. ఇప్పుడు పేర్ని నాని నియామకం ఆ విధంగానే జరిగిందా అన్న చర్చ జోరుగా ప్రచారం అవుతోంది. ఇక వైసీపీ అధినాయకత్వం ఉత్తరాంధ్ర జిల్లాల పార్టీ నేతలతో.. ఫిబ్రవరి 12న కీలక సమావేశం నిర్వహించనుంది. ఈ సమావేశంలోనే పేర్ని నాని నియామకం ఉంటుందని చెబుతున్నారు. మరి చూడాలి ఈ ప్రచారంలో ఎంత వరకు నిజం ఉందో..

# పార్టీలో పదవుల పండగ.. వర్కింగ్ ప్రెసిడెంట్‌పై నేతల కన్ను




హైదరాబాద్, స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోపు తెలంగాణ కాంగ్రెస్‌లో పార్టీ పదవుల జాతర మొదలు కానుంది. దీనిపై కసరత్తు మొదలైపోయింది. పీసీసీ అధ్యక్షుడి తర్వాత వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి కోసం నేతల మధ్య పోటీ ఎక్కువైనట్టు కనిపిస్తోంది. ఆ పదవి దక్కించుకుంటే ఫ్యూచర్‌లో లైఫ్ ఉంటుందనే ఆలోచనలు చేస్తున్నారు కొందరు నేతలు. ఆ తర్వాత పీసీసీ పదవికి పోటీ పడవచ్చని భావిస్తున్నారు కొందరు ఎమ్మెల్యేలు, ఎంపీలు. ఈ క్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్, ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్ష పదవులకు నేతల పేర్లపై కసరత్తు జరుగుతోంది. సామాజిక వర్గానికి ఒకటి చొప్పున వర్కింగ్ ప్రెసిడెంట్ ఇవ్వాలని పార్టీ నిర్ణయించినట్టు గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి. మహేష్ కుమార్ బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిగా ఉన్నారు. ఓసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు ఒకటి చొప్పున ఇవ్వాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో 50 శాతానికి పైగా బీసీలు ఉండడంతో వారికి వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇవ్వాలని ఓ వర్గం నేతలు బలంగా డిమాండ్ చేస్తోంది. ఈ విషయంలో గత ఫార్ములాను అనుసరించాలని పార్టీ ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. ఎస్టీల నుంచి ఎంపీ బలరాం నాయక్, బెల్లయ్యనాయక్, ఎస్సీల నుంచి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మైనార్టీ నుంచి ఫిరోజ్ ఖాన్, ఓసీల నుంచి ఎంపీతోపాటు మాజీ ఎంపీలు, కొందరు నేతలు రేసులో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. పార్టీ పదవుల కోసం సీనియర్ నేతలతోపాటు జూనియర్లు ఎక్కువ మంది పోటీపడడంతో జిల్లాకు ఒకరి చొప్పున నియమించాలనే ప్రతిపాదనలను సైతం పరిశీలిస్తోందట కాంగ్రెస్ పార్టీ. ఈ నేపథ్యంలో జిల్లాకు రెండు పదవులు సూచించాలని జిల్లాలకు చెందిన మంత్రులు, ఇన్ ఛార్జ్ మంత్రులకు పార్టీ సూచన చేసిందట. క్షేత్రస్థాయిలో అంకితభావంతో పని చేసే వారిని పీసీసీ కార్యవర్గంలోకి తీసుకోవాలని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు సూచించినట్టు పార్టీ వర్గాల మాట. ఈ నేపథ్యంలో పార్టీ కోసం కష్టపడే పని చేసేవారి వివరాలను పీసీసీ అధ్యక్షుడు సేకరిస్తున్నారట. మొత్తానికి వారంలోగా పార్టీ పదవులను పూర్తి చేసి తర్వాత స్థానిక ఎన్నికల బాధ్యత ఆయా నేతలకు అప్పగించాలనే ఆలోచన చేస్తోందట కాంగ్రెస్ పార్టీ. దీనివల్ల పదవులు దక్కినవారు ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించే బాధ్యత కూడా ఉంటుంది. రాష్ట్రస్థాయిలో ఖరారు కాగానే జాబితా ఢిల్లీకి పంపి ఏఐసీసీ పెద్దలతో ఆమోదం తర్వాత అధికారికంగా ప్రకటన రానుంది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com